నవతెలంగాణ

1

ఆదిలాబాద్

బుధవారం | ఏప్రిల్ 03, 2024 | www.navatelangana.com

చెక్‌పోస్ట్ ఆకస్మిక తనిఖీ

నవతెలంగాణ-వాంకిడి

పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మంగళవారం అడిషనల్ ఎస్పీ ప్రభాకర్‌రావు, డీఎస్పీ సదయ్యతో కలిసి టోల్ ప్లాజా చెక్‌పోస్టును ఆకస్మికంగా తనిఖీ చేశారు. అడిషనల్ ఎస్పీ వాహనాల రాకపోకలను పరిశీలించారు. రికార్డులను చెక్ చేశారు. తనిఖీ కేంద్రాలు వద్ద చెక్‌పోస్టు సిబ్బంది అప్రమత్తంగా ఉండి, ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసి నగదు, మద్యం, గంజాయి, వరి ధాన్యం అక్రమ రవాణాను అరికట్టేందుకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. చెక్ పోస్ట్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. వారి వెంట సీఐ శ్రీనివాస్ ఉన్నారు.



ఆశ్రమ పాఠశాల వార్డెన్ సస్పెన్షన్

నవతెలంగాణ-ఉట్నూర్

విధుల్లో నిర్లక్ష్యం వహించిన ఉట్నూర్ ఆశ్రమ పాఠశాల వార్డెన్ తిరుమలను సస్పెండ్ చేశారు. మంగళవారం గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ దిలీప్‌కుమార్ పాఠశాలను తనిఖీ చేశారు. గత నెల 27న మూడో తరగతి విద్యార్థి టేకం మాణిక్‌రావు కరెంట్ షాక్‌తో గాయపడ్డాడు. దీనికి వార్డెన్ పర్యవేక్షణ లోపంగా గుర్తించారు. అంతేకాకుండా పాఠశాలలో విద్యార్థులు తక్కువగా ఉన్నా రికార్డ్స్‌లో ఎక్కువ నమోదు చేయడాన్ని గుర్తించారు. పాఠశాలలో 13 మంది వర్కర్లు ఉంటే ముగ్గురే విధుల్లో ఉంటున్నారు. స్టాక్ రిజిస్టర్‌తో పాటు ఇతర రికార్డ్స్ తనిఖీ చేయగా అవన్నీ గందరగోళంగా ఉన్నాయి. వీటన్నింటికీ వార్డెను బాధ్యులుగా చేస్తూ డీడీ ఆమెను సస్పెండ్ చేశారు.



జిల్లాలో అరుదైన గుడ్లగూబ కనువిందు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లాలో అరుదైన మోటిల్డ్ వుడ్ ఔల్ గుడ్ల గూబ జంట కనువిందు చేస్తోంది. జిల్లాకు చెందిన వైల్డ్ లైఫ్ ఫొటోగ్రాఫర్ లింగంపల్లి కృష్ణ మంగళవారం ఉదయం జిల్లా కేంద్రంలోని గాంధీ పార్కులో తన కెమెరాలో బంధించాడు. వెంటనే అటవీశాఖ ఎఫ్ఆర్‌ఓ గులాబ్‌సింగ్ ఈ విషయంపై స్వయంగా తెలుసుకునేందుకు అక్కడికి వెళ్లి కృష్ణ కెమెరాలో తీసిన ఫొటోను అరుదైన గుడ్లగూబగా నిర్ధారించారు. ఇవి దట్టమైన అడవుల్లో ఉంటాయని, 14 నుంచి 18 అంగుళాల ఎత్తులో ఉండి 2పౌండ్ల బరువు కలిగి, నల్లటి పెద్ద పెద్ద కళ్లు కలిగి గోధుమ, తెలుపు, ఎరుపు రంగుల్లో ఉంటాయి. చెట్ల బెరడు రంగుల్లో కలిసిపోయి ఎవరూ గుర్తు పట్టకుండా ఉంటాయన్నారు. ఇవి ఇక్కడికి రావడం ఆనందంగా ఉందని, ఇటువంటి గుడ్లగూబలు కనబడడం చాలా అరుదు అని పేర్కొన్నారు. వీటిని కాపాడేందుకు తగు చర్యలు తీసుకుంటామని గులాబ్‌సింగ్ తెలిపారు. వీటిని గుర్తించిన కృష్ణను అభినందించారు.

మహిళలు నిర్భయంగా సంప్రదించొచ్చు : ఎస్పీ సురేష్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

మహిళలు నిత్యజీవితంలో ఏర్పడే వివిధ రకాల వేధింపుల సమస్యలపై పోలీసులను నిర్భయంగా సంప్రదించవచ్చని ఎస్పీ సురేష్ కుమార్ అన్నారు. తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మహిళలు ర్యాగింగ్, ఈవ్ టీజింగ్‌కి గురైతే షీ టీమ్ మొబైల్ నంబర్ 8712670564 లేదా డయల్ 100ను ఫోన్ చేయాలన్నారు. మహిళల రక్షణ కోసం షీటీం, యాంటీ ఉమెన్ ట్రాఫికింగ్ టీంలు పనిచేస్తున్నాయని తెలిపారు. విద్యార్థినులు, మహిళలు అన్యాయానికి గురైనప్పుడు భయపడవద్దని, ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదు చేస్తే నిందితులపై చర్యలు తీసుకుంటామన్నారు. కళాశాల, పాఠశాలల విద్యార్థులకు ర్యాగింగ్, ఈవ్ టిజింగ్, ఫోక్సో, షీటీం, యాంటీ ఉమెన్ ట్రాఫికింగ్‌పై అవగాహన కార్యక్రమాల ద్వారా జిల్లాలో చైతనం కల్పించామన్నారు. జిల్లా వ్యాప్తంగా జనవరి నెలలో షీటీంకు రెండు కేసులు నమోదు చేశామని అందులో ఒక కేసులో ఎఫ్ఐఆర్ నమోదు చేశామని, మరొక కేసుకు కౌన్సిలింగ్ ఇచ్చామని, అలాగే 11 అవగాహన కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. చిన్న పిల్లల రక్షణ విషయంలో పోలీసు శాఖ పటిష్ఠ చర్యలు చేపడుతుందన్నారు. మహిళలు సామాజిక మాధ్యమాలైన ఫేస్ బుక్, వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్ వినియోగంలో చాలా జాగ్రత్తగా ఉండాలని, ఫొటోలు, వీడియోలు పోస్టు చేసే సమయంలో వ్యక్తిగత భద్రతకు సంబంధించి అన్ని రకాల చర్యలు తీసుకోవాలని సూచించారు. నేరుగా సంప్రదించలేని వారు 87126 70564, లేదా డయల్ 100కు సమాచారం అందించాలని, వారి వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందని తెలిపారు.

వేతనాల కోసం మళ్లీ విధుల బహిష్కరణ

- పండుగల సమయంలో కార్మికుల పస్తులు
- ధర్నా శిబిరాన్ని సందర్శించిన సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి మధు

నవతెలంగాణ-కాగజ్‌నగర్

మున్సిపల్ కాంట్రాక్టు పారిశుధ్య కార్మికులు మళ్లీ విధుల బహిష్కరణ చేపట్టారు. పండుగల సమయంలో వారు ఆందోళన చేపడితే కాని వేతనాలు చెల్లించలేని పరిస్థితి. ప్రస్తుతం ఉగాది పండుగ వస్తుండటం, వేతనాలు రాక మూడు నెలలు దాటి పోవడంతో కాగజ్‌నగర్ మున్సిపల్ కాంట్రాక్టు పారిశుధ్య కార్మికులు మళ్లీ ఆందోళనకు దిగారు. మంగళవారం కార్మికులు ఒకపూట విధులు బహిష్కరించి, మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నాకు దిగారు. ఉదయం 5 గంటల నుంచి తొమ్మిది గంటల వరకు విధులు నిర్వర్తించిన కార్మికులు, తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విధులు బహిష్కరించారు. కాంట్రాక్టు కార్మికులకు చివరి సారిగా డిసెంబర్‌లో వేతనాలు చెల్లించారు. జనవరి నెల నుంచి వేతనాలు లేవు. ఎన్ఎంఆర్ కార్మికులకు గత నాలుగు నెలలుగా వేతనాలు చెల్లించడం లేదు. అంతేకాకుండా పీఎఫ్, ఈఎస్ఐ కూడా ఆయా ఖాతాలలో జమచేయడం లేదు. సుమారు రూ. 2 కోట్ల వరకు మున్సిపాలిటీ పీఎఫ్, ఈఎస్ఐ ఖాతాలలో జమ చేయాల్సి ఉంది. ఇప్పటి వరకు చెల్లించకపోవడంతో తప్పనిసరి పరిస్థితులలో కార్మికులు విధులు బహిష్కరణకు నిర్ణయం తీసుకున్నారు.



కార్మికుల ధర్నా శిబిరాన్ని సందర్శించిన సీఐటీయయూ రాష్ట్ర కార్యదర్శి మధు



మున్సిపల్ మేనేజర్‌కు వినతిపత్రం ఇస్తున్న కార్మికులు

కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళన ఉధృతం

కాగజ్‌నగర్ మున్సిపల్ కాంట్రాక్టు కార్మికుల సమస్యల పరిష్కరించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి మధు స్పష్టం చేశారు. తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కార్యాలయం ముందు చేపడుతున్న ధర్నా శిబిరాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేతనాలు ఇవ్వాలని, ఈఎస్ఐ, పీఎఫ్ చెల్లించాలని కార్మికులు కమీషనర్‌కు ఎన్నిసార్లు వినతిపత్రాలు ఇచ్చినా స్పందన లేదని అన్నారు. ప్రతీ నెలా మొదటి వారంలో వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా సమస్యలు పరిష్కరించాలని, లేనిపక్షంలో రాబోయే రోజులలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముంజం శ్రీనివాస్, యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శంకర్, సంజీవ్, కార్మికులు మల్లేష్, రమేష్, శంకరమ్మ, నారాయణ, అశోక్, మధు పాల్గొన్నారు.

ఉద్యోగికి పదవీ విరమణ సహజం

- ఎస్పీ సురేష్ కుమార్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రభుత్వ ఉద్యోగికి పదవీ విరమణ సహజమని ఎస్పీ సురేష్ కుమార్ అన్నారు. జిల్లా పోలీస్ శాఖలో ఏఆర్ ఎస్ఐగా విధులు నిర్వర్తిస్తున్న ఎస్కే అహ్మద్, హోంగార్డు ఎస్‌కె సాజిద్ పదవీ విరమణ పొందగా వారిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్పీ పోలీస్ శాఖకు వారు చేసిన సేవలు కొనియాడారు. ప్రభుత్వ ఉద్యోగులకు పదవి విరమణ సహజమని, ఉద్యోగంలో ఉన్నప్పుడు చేసిన సేవలు తర్వాత సమాజంలో విలువను తెస్తాయన్నారు. ప్రతిక్షణం ప్రజలకు సేవ చేయడమే పోలీసుల లక్ష్యంగా ఉండాలన్నారు. అప్పుడే గుర్తింపు లభిస్తుందని తెలిపారు. పదవి విరమణ చెందిన ఇద్దరు ఉద్యోగులు ఎంతో సేవ చేశారని కితాబునిచ్చారు. వారి శేష జీవితం సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షించారు. భవిష్యత్తులో పోలీస్ శాఖ తరపున ఏ అవసరమైనా అండగా ఉంటామని వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పి(అడ్మిన్) ప్రభాకర్‌రావు, డీఎస్పీ సదయ్య, కరుణాకర్, సిఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

గెలుపునకు ప్రతి కార్యకర్త కృషి చేయాలి



నవతెలంగాణ-జైనథ్

ఎంపీగా తనను గెలిపించడానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని బీజేపీ ఎంపీ అభ్యర్థి గెడం నగేష్ అన్నారు. మంగళవారం మండలంలోని నిరాల గ్రామంలో బీజేపీ మండల కార్యవర్గ సమావేశంలో ఎమ్మెల్యే పాయల్ శంకర్‌తో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నగేష్ మాట్లాడుతూ నిజాయితీగా, అంకిత భావంతో పనిచేసే ఏకైక కార్యకర్త బీజేపీ కార్యకర్త అని కొనియాడారు. ప్రధానిగా మరోమారు మోడీ కావాలని అన్ని వర్గాల ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. రాష్ట్రంలో మొత్తం 17స్థానాలు బీజేపీ గెలవబోతోందని ధీమా వ్యక్తం చేశారు. ప్రజా పాలనను పక్కనబెట్టి ఇతర పార్టీ నాయకులను పార్టీలో చేర్చుకోవడమే కాంగ్రెస్ పార్టీ పనిగా పెట్టుకుందని ఎద్దేవా చేశారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే పాయల్ శంకర్ మాట్లాడుతూ బీజేపీకి కార్యకర్తలే ఊపిరి అని తెలిపారు. ఎంపీ అభ్యర్థిని గెలిపించుకోవడానికి ప్రతి కార్యకర్త అకుంఠిత దీక్షతో పనిచేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అశోక్ ముస్తాపురే, పార్లమెంట్ కో కన్వీనర్ మయూర్ చంద్ర, విజయ్, బీజేపీ నాయకురాలు జ్యోతిరెడ్డి, మండల అధ్యక్షులు రాందాస్, రమేశ్, ఎంపీటీసీ కరుణాకర్‌రెడ్డి, చంద్రకాంత్, బింగి దయాకర్ పాల్గొన్నారు.

ఎండ నుండి రక్షణకు ప్రత్యేక చర్యలు

- ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

నవతెలంగాణ-ఆసిఫాబాద్

అధిక ఉష్ణోగ్రతల దృష్ట్యా ప్రజలను ఎండ తీవ్రత నుండి రక్షించేందుకు జిల్లా అధికారుల సమన్వయంతో ప్రత్యేక చర్యలు చేపట్టడం జరుగుతుందని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. మంగళవారం జిల్లా అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) దీపక్ తివారి, జిల్లా అటవీ అధికారి నీరజ్ కుమార్‌తో కలిసి టాస్క్‌ఫోర్స్ కమిటీ సభ్యులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో జిల్లాలో చేపట్టాల్సిన కార్యక్రమాల నిర్వహణ కొరకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, జిల్లా విద్యాశాఖ, జిల్లా గిరిజనాభివృద్ధి శాఖ, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖల అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, జిల్లా పంచాయతీ అధికారులతో టాస్క్ ఫోర్స్ కమిటీని ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రాల పరిధిలోని ఆరోగ్య, ఆశా కార్యకర్తల వద్ద వడదెబ్బకు గురైన బాధితులకు తక్షణ ఉపశమనం కొరకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలని, ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాలు, ప్రభుత్వ పాఠశాలలలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మందులు అందుబాటులో ఉంచాలని, ఎండ తీవ్రత దృష్ట్యా విద్యార్థులు బయట తిరగకుండా అధికారులు దృష్టి సారించాలని తెలిపారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ కింద చేపట్టే పనుల ప్రదేశాలలో ఉపాధి కూలీల కొరకు షామియానా, తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని, వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు, వారసంతల వద్ద తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లను ఉంచాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలోని ప్రతి గ్రామం, మున్సిపాలిటీలలో ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా చర్యలు చేపట్టడంతో పాటు బస్‌స్టేషన్లు, జనాలు రద్దీగా ఉండే ప్రాంతాలలో చలివేంద్రాలు ఏర్పాటు చేసి తాగునీరు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. గ్రామాలలో పశువుల దాహం తీర్చేందుకు నీటి తొట్టెలలో ఎప్పుడు నీళ్లు ఉండేలా చూడాలని, తాగునీటి సమస్య అధికంగా ఉన్నచోట ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా తాగునీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు.



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ ధోత్రే, సమావేశంలో అదనపు కలెక్టర్ దీపక్ తివారీ, అటవీ శాఖాధికారి నీరజ్‌కుమార్

ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి తుకారాం, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సురేందర్, జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి రమాదేవి, జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్, వైద్య ఆరోగ్యశాఖ ఉప వైద్యాధికారి సుధాకర్ నాయక్, డివిజనల్ పంచాయతీ అధికారి ఉమర్ హుస్సేన్, మున్సిపల్ కమిషనర్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

బాలిక అదృశ్యం కేసు నమోదు

నవతెలంగాణ-దహెగాం

మండలంలోని ఒడ్డుగూడ గ్రామానికి చెందిన బాలిక(16) అదృశ్యమైందని ఎస్సై కుందారపు రాజు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం గత నెల 31న రాత్రి ఇంట్లో నుండి వెళ్లిపోయింది. చుట్టుపక్కల ఇండ్లతో పాటు బంధువుల ఇండ్లలోనూ వెతికినా ఆచూకీ లభించలేదు. తండ్రి దేవాజీ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ప్రజలు ప్రశాంత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకోవాలి



నవతెలంగాణ-జైనథ్

ప్రజలు ప్రశాంత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకోవాలని డీఎస్పీ జీవన్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని దీపాయిగూడ, ఆనంద్‌పూర్ గ్రామాల్లో కేంద్ర బలగాలతో పోలీసులు కవాతు నిర్వహించారు. రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు ప్రశాంత వాతావరణంలో స్వేచ్ఛగా, నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలనే ఉద్దేశంతో కవాతు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సిఐ డి.సాయినాథ్, సీఆర్పీఎఫ్ సిఐ సూరజ్, ఎస్ఐ పురుషోత్తం పాల్గొన్నారు.

రైతులకు పంట నష్టపరిహారం చెల్లించాలి

- ఎమ్మెల్యే కోవ లక్ష్మి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

కరువు కాలంలో తీవ్రంగా నష్టపోయిన రైతులకు పంట నష్టపరిహారం చెల్లించాలని ఎమ్మెల్యే కోవ లక్ష్మి డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతు సమస్యలను పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వము పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన 6 గ్యారంటీలను అమలు చేయక సతమతమవుతోందని విమర్శించారు. పంట సాగుకు నీరు అందక ఎండిపోయిన పంటలను గుర్తించి ఎకరానికి రూ.25 వేలు అందించాలని, ప్రభుత్వం ఏర్పడిన 100 రోజులలోపు రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని, రైతు పండించిన పంటలకు రూ. 500 బోనస్ ప్రకటిస్తామని, రైతుబంధు క్రింద ఎకరానికి రైతులకు 15 వేలు ఇస్తామని ప్రకటించిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటి వరకు అందించలేదని దుయ్యబట్టారు. అదే విధంగా రైతుల కోసం నూతనంగా ఏ పథకాన్ని ప్రారంభించలేదన్నారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్ల ఆధారంగానే ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగాలు ఇస్తుందని కొత్త ఉద్యోగం ఒక్కటి కూడా ఇవ్వలేదని ఆరోపించారు. అబద్ధపు ప్రచారాలతో గద్దె నెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వానికి త్వరలో జరగబోయే పార్లమెంట్ ఎన్నికలలో ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని పేర్కొన్నారు. అంతకు ముందు బీఆర్ఎస్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు రైతులకు పంట నష్టం, పంటలపై బోనస్ ప్రకటించాలనే డిమాండ్లతో ఎమ్మెల్యేతో పాటు పార్టీ నాయకులు కలిసి కలెక్టరేట్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వరరావు, జిల్లా నాయకులు సరస్వతి, మండలాల బీఆర్ఎస్ జెడ్పీటీసీలు, ఎంపీపీలు, పార్టీ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్-నిర్మల్
బుధవారం | ఏప్రిల్ 03, 2024 | www.navatelangana.com

వరి కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

నవతెలంగాణ-లక్ష్మణచాంద

డీసీఎంఎస్ లక్ష్మణచాంద ఆధ్వర్యంలో మండలంలోని మునిపల్లి, రాచపూర్, మల్లాపూర్, బాబాపూర్ గ్రామాల్లో మంగళవారం వరికొనుగోలు కేంద్రాలను వ్యవసాయాధికారి ప్రవీణ్ కుమార్ ప్రారంభించారు. రైతులు దళారులను నమ్మి మోసపోకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలలో



అమ్ముకోవాలని అధికారులు సూచించారు. వరి ధాన్యం ఏ గ్రేడ్ ధర రూ.2203 ఒక క్వింటల్‌కు ప్రభుత్వం నిర్ణయించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు జాదవ్ ఉమ, పవిత్ర, సిబ్బంది, సెంటర్ల నిర్వాహకులు, స్థానిక రైతులు పాల్గొన్నారు.

మహిళ హక్కులపై అవగాహన

నవతెలంగాణ-జైనథ్

జిల్లా మహిళ సాధికారత కేంద్రం, సఖి కేంద్రం సంయుక్తంగా మండలంలోని గిమ్మ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం మహిళ సాధికారతపై అవగహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కోఆర్డినేటర్ యశోద మాట్లాడుతూ భేటీ బచావో భేటీ పడావో పథకం, గృహ హింస చట్టం, పని చేసే చోట లైంగిక వేదింపులు, లింగ వివక్షత గురించి అవగహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ పీహెచ్‌సీ డాక్టర్ సూచల, సఖీ కేంద్రం నిర్వాహకురాలు సరస్వతి, ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.



సంఘానికి గుర్తింపు తీసుకువచ్చేలా వ్యవహరించాలి

- ప్రమాణ స్వీకారంలో పాల్గొన్న ఎమ్మెల్యే



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కుల సంఘాల్లో బాధ్యతలు తీసుకున్న వారు ఓపికతో ఉంటూ సమస్యల పరిష్కరంతో పాటు సమాజంలో సంఘానికి గుర్తింపు తీసుకువచ్చేలా వ్యవహరించాలని ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. మంగళవారం ఆర్ఎస్ గార్డెన్‌లో ఇటీవల ఎన్నికైన రజక సంఘం పట్టణ కార్యవర్గ ప్రమాణ స్వీకారానికి బీజేపీ ఎంపీ అభ్యర్థి గోడం నగేష్‌తో కలిసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం అతిథులను సంఘం తరపున శాలువా, పూలమాలతో సత్కరించారు. అంతకు ముందు నాంచారమ్మ ఆలయంలో పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయల శంకర్ మాట్లాడుతూ సంఘ బలోపేతం కోసం నూతనంగా ఎన్నికైన పట్టణ కార్యవర్గం ఆ దిశగా పని చేయాలన్నారు. గతంలో రజక సంఘం నాయకులు తనను కలిసిన సమయంలో ఆస్తులు పెంచుకోవాలని సూచించడం జరిగిందన్నారు. అప్పుడే సంఘ భవనానికి స్థలం వచ్చిందన్న విషయాన్ని గుర్తు చేశారు. అదే విధంగా రజక సంఘం నాయకులు పలు సమస్యలను తన దృష్టికి తీసుకువచ్చారని, వాటి పరిష్కరం కోసం ఎన్నికల కోడ్ ముగిసిన తరువాత కృషి చేస్తానని బరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చిక్కల దత్తు, కలాల శ్రీనివాస్, దోబికాలనీ కౌన్సిలర్ భరత్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్రాల నగేష్, రజక సంఘం పట్టణ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సంతోష్, వినోద్, బీజేపీ నాయకురాలు జ్యోతిరెడ్డి పాల్గొన్నారు.

ఆదివాసుల సమస్యల పరిష్కారానికి కృషి



నవతెలంగాణ-బేల

ఆదివాసుల సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని ఆదిలాబాద్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి రూపేష్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని సాంగి గ్రామపంచాయతీ పరిధిలోని జామ్డ గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడారు. గ్రామంలో ఎండకాలం నేపథ్యంలో మంచినీటి సమస్యతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని అన్నారు. దీంతో పాటు అనేక సమస్యలు ఉన్నాయని, వాటిని పరిష్కరించాలని కోరారు. దీనికి స్పందించిన యువజన కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి సంబంధిత అధికారులకు ఫోన్ ద్వారా సంప్రదించి, సమస్యను వివరించారు. వెంటనే పరిష్కరించి ఈ వేసవి కాలంలోనే వారికి మంచినీటి సౌకర్యం అందుబాటులోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కాగా ఈ సమస్యలు పూర్తిస్థాయిలో పరిష్కారం కావాలంటే ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి సుగుణను మనమంతా కలిసికట్టుగా గెలిపించాల్సిన అవసరముందని తెలిపారు. త్వరలో జరగబోయే ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని గెలిపించేందుకు హస్తం గుర్తుకు ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. ఆయనతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకుడు ప్రమోద్‌రెడ్డి, గ్రామ పటేల్ సంబు, చిన్ను, కినక ఆనంద్, కిష్టు, లచ్చు, వాగు ఉన్నారు.

ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు సహకరించాలి

నవతెలంగాణ-లక్ష్మణచాంద

పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మంగళవారం సోన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ నవీన్ కుమార్ ఆధ్వర్యంలో మామడ మండలం పరిమండల్ గ్రామం తో పాటు లక్ష్మణచాంద మండలం కనకపూర్ గ్రామంలో పోలీస్ కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రశాంతవాతావరణంలో ఎన్నికల నిర్వాహణకు ప్రతీ ఒక్కరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఆర్పీఎఫ్ ఇన్స్పెక్టర్, లక్ష్మణచాంద ఎస్సై శ్రీకాంత్, మామడ ఎస్సై సందీప్, సీఆర్పీఎఫ్ బలగాలు, సర్కిల్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీ ఎంపీ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

- ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్

నవతెలంగాణ-కుభీర్

ఆదిలాబాద్ పార్లమెంట్ ఎన్నికలో బీజేపీ ఎంపీ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలని ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ అన్నారు. మంగళవారం కుభీర్ మండల కేంద్రంలో మండల బీజేపీ కార్యకర్తల సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రామారావు పటేల్ మాట్లాడుతూ ఈ పార్లమెంటు ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థి గోడం నగేష్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని అన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం చేపడుతున్న వివిధ కార్యక్రమాలు ప్రజలు వివరించేలా చూడాలని కార్యకర్తలకు సూచించారు. అదే విధంగా కాంగ్రెస్ పార్టీ ఎన్నికలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను పక్కాగా అమలు చేసేలా చూస్తామని అన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఉన్న బూత్ లెవల్ కార్యకర్తలు కొత్త పాత కార్యకర్తలతో సమన్వయంతో పని చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు ఏశాల దత్తత్రి, లింబాద్రి, నగేష్, సాప్లీ రమేష్, కోఆప్షన్ సభ్యుడు దత్తుహరి పటేల్, దిగంబర్ పటేల్, సాయినాథ్ మండల బీజేపీ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

రాజ్యాధికారం రావాలని కాంక్షించిన వ్యక్తి పాపన్నగౌడ్

- ఎమ్మెల్యే పాయల శంకర్



సర్ధార్ సర్వాయి పాపన్నగౌడ్ వర్ధంతి వేడుకల్లో ఎమ్మెల్యే పాయల శంకర్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

బహుజనులకు రాజ్యాధికారం రావాలని కాంక్షించిన మహోన్నతమైన వ్యక్తి సర్ధార్ సర్వాయి పాపన్నగౌడ్ అని ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. మంగళవారం గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సర్ధార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. బస్టాండ్ ఎదుట గల పాపన్న విగ్రహం వద్ద ఆయన చిత్రపటానికి పూజలు చేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయల శంకర్ మాట్లాడుతూ మహనీయులు చేసిన సేవలను నేటి తరం వారు మర్చిపోతున్నారన్నారు. వారు చేసిన త్యాగలను గుర్తించడంతో పాటు ఆశయాలను ముందుకు తీసుకేళ్లడం బాధ్యతగా బావిస్తూ ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. గ్రామన గ్రామన సర్ధార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహాలను ప్రభుత్వ ఖర్చులతో ఏర్పాటు చేయాలని, ఈ విషయంలో అసెంబ్లీలో ప్రస్తవిస్తానని తెలిపారు. కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు సుధాకర్‌గౌడ్, భూమగౌడ్, రమేష్ చందర్‌గౌడ్, లక్ష్మీనారాయణగౌడ్, దినేష్‌గౌడ్, చరణ్‌గౌడ్, నరేష్‌గౌడ్, బీజేపీ నాయకులు లాలామున్న, విజయ్, జ్యోతిరెడ్డి, భీంసేన్ రెడ్డి పాల్గొన్నారు.

కడెం : రాచరికపు వ్యవస్థ నీడలో జమీందార్లు, జాగీర్దాల అరాచకాలను సహించలేక కడుపు మండి కత్తి పట్టిన వీరుడు, దళిత, బహుజనులు ఏకమై పోరాడితేనే రాజ్యాధికారం సాధించవచ్చని నిరూపించిన సామాన్యుడు సర్ధార్ సర్వాయి పాపన్నగౌడ్ అని మండల గౌడ సంఘం నాయకులు అన్నారు. సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ 314వ వర్ధంతిని పురస్కరించుకొని మంగళవారం మండల కేంద్రంలోని పాపన్నగౌడ్ విగ్రహం వద్ద మండల గౌడ సంఘం నాయకులు పాపన్నగౌడ్ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొగలులు, రజాకారుల ఆదిపత్యాన్ని ఎదిరించి బహుజనుల రాజ్యాధికారం కోసం తన ప్రాణాన్ని సైతం లెక్కచేయకుండా బహుజనులందరినీ ఏకతాటిపైకి తెచ్చి గోల్కొండ కోటపై జెండా ఎగరవేసిన యోధుడు పాపన్న గౌడ్ అని కొనియాడారు. బహుజన వాదంతో కూడిన ఆయన ఆశయాలను కొనసాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు, కులస్తులు శేఖర్ గౌడ్, రాజేశ్వర్‌గౌడ్, రవీందర్‌గౌడ్, దశిగౌడ్, రాజాగౌడ్, మల్లగౌడ్, నర్సాగౌడ్ పాల్గొన్నారు.

పంట నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వాలి

- కలెక్టర్‌కు బీఆర్ఎస్ నాయకుల వినతి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

అకాల వర్షం, వడగండ్ల వానతో నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.25 వేలను ఇవ్వాలని, మాజీ రైతు సమన్వయ సమితి కోఆర్డినేటర్ రోకండ్ల రమేష్ అన్నారు. మంగళవారం శనగ, మొక్క జొన్న పంటలకు గిట్టుబాటు ధరలతో, రూ.500 రూపాయల బోనస్‌తో కొనాలని కోరుతూ కలెక్టర్ రాజర్షిషాకు వినతిపత్రం అందించారు. అకాలవర్షం, వడగాండ్ల వర్షంతో నష్టపోయిన రైతుల సమస్యలను కలెక్టర్‌కు వివరించారు.

ఈ సందర్భంగా మాజీ రైతు సమన్వయ సమితి కోఆర్డినేటర్ రోకండ్ల రమేష్ మాట్లాడుతూ ఇటీవల కురిసిన అకాల వర్షం, వడగండ్ల వర్షం కారణంగా రైతులు తమ పంటలను నష్టపోయారని తెలిపారు. ప్రభుత్వం నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.25 వేల చొప్పున పరిహారం ఇవ్వాలని కోరారు. అదే విధంగా కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన హామీలకు అనుగుణంగా వరి పంటకు బోనస్ రూ.500 చెల్లించాలన్నారు. శనగ, మొక్క జొన్న పంటలను గిట్టుబాటు ధరలతో కొనాలని కోరారు. రైతుబంధు, రైతు భీమాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైతుల సమస్యలపై ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే ఉద్యమాలు చేపడుతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు నారాయణ, జైనథ్, ఆదిలాబాద్ ఎంపీపీలు గోవర్ధన్, రమేష్, మెట్టు ప్రహ్లాద్, దాసరి రమేష్, కుమ్ర రాజు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

వచ్చే ఎన్నికల్లో బీజేపీని చిత్తుగా ఓడించాలి

- వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి లంక రాఘవులు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న లంక రాఘవులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో మోడీ ప్రభుత్వాన్ని చిత్తుగా ఓడించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి లంక రాఘవులు పిలుపునిచ్చారు. మంగళవారం జిల్లా కేంద్రంలో సుందరయ్య భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఉపాధి హామీ కూలీలకు మోడీ ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేస్తుందన్నారు. పదేండ్ల కాలంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలను అవలంభించిందన్నారు. నిత్యావసర ధరలను పెంచిందని, ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసేలా బడ్జెట్‌లో కోత విధించిందని ఆరోపించారు. అదే విధంగా రాష్ట్రంలోని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఎన్నికల్లో కూలీలకు కూలీ బంధు కింద రూ.12 వేలు అందిస్తామని ప్రకటించారని కానీ ఇప్పటి వరకు అందించలేదన్నారు. ఇచ్చిన హామీలను విస్మరిస్తున్న ప్రభుత్వాలకు గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని ఓడించాలని కోరారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు స్వామి, నాయకురాలు పొచ్చక్క, నాయకులు కె.ఆశన్న, డి.ఆశన్న, గంగారాం, బాపన్న ఉన్నారు.

ఆర్‌అండ్‌బీ రోడ్డు గుంతలకు మరమ్మతులు చేపట్టాలి

నవతెలంగాణ-ఉట్నూర్

ఆర్ అండ్ బి రోడ్డు గుంతలకు మరమ్మతులు చేపట్టాలని ఆదివాసీ లంబాడాల ఐక్యవేదిక ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఉపాధ్యక్షులు బానోత్ రవీందర్ అన్నారు. మంగళవారం మండలంలోని లింగోజీ తండా ఎక్స్ రోడ్డు నుంచి ఆసిఫాబాద్ వరకు ఆర్ అండ్ బి రోడ్డుపై ఎర్పడిన గుంతలకు మరమ్మతులు చేయాలని అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుంతల వల్ల హస్నాపూర్ గ్రామ సమీపంలో ఇప్పటివరకు నలుగురు మృతి చెందారని, అయినప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ఆర్ అండ్ బి అధికారులు చూసి చూడనట్లు వ్యావహరిస్తున్నారని అన్నారు. ఆ రోడ్డు గుండా ప్రయాణించే ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని అన్నారు. గత రెండు సంవత్సరం నుంచి రోడ్డు ఇలాగే ఉందని, గుంతల వల్ల మనుషులు ప్రాణాలు పోతుంటే ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. రోడ్డుపై ఎర్పడిన గుంతలకు మరమ్మతులు చేసి మనషుల ప్రాణాలను రక్షించాలని కోరారు. రెండు, మూడు రోజుల్లో మరమ్మతులు చేయకపోతే పోరాటం చేస్తామని అధికారులను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారిలో లంబాడా జేఏసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బానోత్ జగన్ నాయక్ అడ్వకేట్, పవార్ విజయ్ కుమార్ ఉన్నారు.



మైనార్టీల సంక్షేమానికి కాంగ్రెస్ కట్టుబడి ఉంది

- ఇఫ్తార్ విందులో పాల్గొన్న మంత్రి సీతక్క

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మైనార్టీల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క అన్నారు. సోమవారం రాత్రి కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందును ఏర్పాటు చేయగా, ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణతో కలిసి ఆమె ముఖ్యఅథితిగా హజరయ్యారు. ఈ సందర్భంగా ముస్లీం మత పెద్దలు ప్రార్ధనలు చేశారు. అనంతరం ముస్లీం సోదరులకు ఖర్జురాలకు తినిపించారు. ఈ సందర్భంగా జిల్లా ఇన్‌చార్జీ మంత్రి సీతక్క మాట్లాడుతూ రంజాన్ మాసంలో ముస్లీం సోదరులకు ఇఫ్తార్ విందును పార్టీ పరంగా ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. ఈ సారి కేంద్రంలో కాంగ్రెస్ అధికారం చేపట్టేలా ప్రజలు సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మెన్ అడ్డి భోజారెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షుడు సత్తు మల్లేష్, అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జీ కంది శ్రీనివాస్ రెడ్డి, మైనార్టీ నాయకులు షకిల్, కలీం పాల్గొన్నారు.



ఇఫ్తార్ విందులో పాల్గొన్న మంత్రి సీతక్క, ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ

పేదలు పండుగను సంతోషంగా నిర్వహించుకోవాలి

- పేద ముస్లిములకు సరుకుల పంపిణీ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పండుగలను పేదలు సంతోషంగా నిర్వహించుకోవాలనే ఉద్దేశంతో దారుల్ అన్సార్ వెల్ఫర్ సొసైటి ఆధ్వర్యంలో సరకులను పంపిణీ చేయడం అభినందనీయమని హజ్ సొసైటి జిల్లా అధ్యక్షుడు షాహిద్ అహ్మద్ తవక్కల్ అన్నారు. మంగళవారం సెంట్రల్ గార్డెన్‌లో దారుల్ అన్సార్ సొసైటీ ఆధ్వర్యంలో రంజాన్ సరకుల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పేద ముస్లీం కుటుంబాలకు సరకులను అందించారు. ఈ సందర్భంగా హజ్ సొసైటి జిల్లా అధ్యక్షుడు షాహిద్ అహ్మద్ తవక్కల్ మాట్లాడుతూ రంజాన్ మాసాన్ని పురస్కరించుకోని పేద కుటుంబాలకు సరకులను అందించడం అభినందనీయమన్నారు. ఈ సొసైటి ఆధ్వర్యంలో ఇతర సేవ కార్యక్రమాలు కూడా కొనసాగుతున్నాయని తెలిపారు. దాతలు ముందుకు వచ్చి ఇలాంటి సొసైటీలకు సహకారం అందించాలని కోరారు. ఈ కార్యకమంలో హజ్ సొసైటి ప్రధాన కార్యదర్శి మహ్మద్ ఆసిఫోద్దిన్, దారుల్ అన్సర్ సొసైటి ప్రధాన కార్యదర్శి ఖిజార్ అహ్మద్, ఉపాధ్యక్షుడు ఆరీఫ్ ఖాన్, అత ఉల్లా, అమీమ్ షరీఫ్, షేక్ మొయిస్, అస్మత్ అలీ, రఖీబ అజ్జు హుస్సేన్ పాల్గొన్నారు.

బీజేపీలో మాజీ సర్పంచుల చేరిక



నవతెలంగాణ-బేల

మండలంలోని బేల గ్రామపంచాయతీ మాజీ సర్పంచ్ వట్టిపెల్లి ఇంద్ర శేఖర్, మనియార్‌పూర్ సర్పంచ్ తేజరావుతో పాటు పలువురు బీజేపీలో చేరారు. వారిని ఎమ్మెల్యే పాయల శంకర్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆదిలాబాద్ నియోజకవర్గంలోని బేల మండలాల బూతు స్థాయి నాయకులతో కార్యకర్తలతో విస్తృత సమావేశాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే పాయల్ శంకర్, ఎంపీ అభ్యర్థి గోడం నగేష్ మాట్లాడుతూ నరేంద్ర మోడీ నేతృత్వంలో భారతదేశం విజయ శిఖరాలను అధిరోహించిందని అన్నారు. ఆ నాయకత్వం మనకు మళ్ళీ కావాలి అంటే కార్యకర్తలు సమిష్టిగా కృషి చేసి, బీజేపీకి ఓటేసీ గెలిపించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బేల మండల బీజేపీ అధ్యక్షులు దత్తానిక్కం, మురళీధర్ ఠాక్రె, భోయర్ విజయ్, చిలుకూరు జ్యోతిరెడ్డి, అశోక్, సందీప్, నవీన్, మహేష్, కృష్ణ, గణేష్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని దేవాపూర్ గ్రామంలో మంగళవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. గ్రామస్తులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. దేవాపూర్ గ్రామానికి చెందిన గుట్టే రామేశ్వర్(20) మంగళవారం తెల్లవారుజామున ఇంట్లోనే ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సోమవారం రాత్రి కుటుంబ సభ్యులు భోజనం చేసి నిద్రపోగా, పొద్దునే లేచి కుటుంబ సభ్యులు ఎవరి పనుల్లో వారున్నారు. ఎంతకీ మృతుడు నిద్ర నుంచి లేవక పోవడంతో కుటుంబీకులు తలుపు తట్టగా తీయక పోవడంతో అనుమానం వచ్చి కిటికీ నుంచి చూడగా ఉరేసుకున్నాడు. ఈ సమాచారాన్ని స్థానిక పోలీసులకు తెలిపారు. మృతుడి ఆత్మహత్యకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

బీజేపీ ఎంపీ అభ్యర్థి నగేష్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలి

- జెడ్పీటీసీ పుష్పలత

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ ఎంపీ అభ్యర్థి గోడం నగేష్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని జెడ్పీటీసీ అర్క పుష్పలత పిలుపు నిచ్చారు. మంగళవారం ఆ పార్టీ నాయకులు ఆరెల్లి రాజలింగం ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో ఉన్న నరేంద్ర మోడీ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన వివిధ సంక్షేమ పథకాలపై వివరించారు. ప్రజల కోసం పని చేసే బీజేపీకే మళ్లీ పట్టం కట్టాలని సూచించారు. పేదల కోసం జన్‌మన్ పథకం, ఎస్టీ మహిళకు రాష్ట్రపతి పదవి ఇచ్చిన ఘనత మోడీదేనని ప్రచారం చేశారు. ప్రతి ఇంటింటికీ వెళ్లి నగేష్‌ను గెలిపించాలని ఓ టర్లను వేడుకున్నారు. ఈ ప్రచారంలో మారుతి, శివ కుమార్, రాజు ఉన్నారు.

ఇంటింటికీ బీజేపీ ప్రచారం

నవతెలంగాణ-లక్ష్మణచాంద

సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని నర్సాపూర్ (డబ్ల్యూ) గ్రామంలో బీజేపీ రాష్ట్ర నాయకులు రావుల రాంనాథ్ కేంద్ర ప్రభుత్వం పథకాల ద్వారా లబ్ది పొందిన కుటుంబాలను ఇంటింటికి వెళ్లి కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికి డోర్ స్టిక్కర్ అతికించి, మోడీ పాలన క్యాలెండర్ ఆదేవిధంగా కరపత్రం పంపిణీ చేసి మూడోసారి ప్రధాన మంత్రిగా నరేంద్ర మోడీని ఎన్నుకొని బీజేపీని అఖండ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా రావుల రాంనాథ్ మాట్లాడుతూ మోడీ ప్రభుత్వ లక్ష్యం భారత దేశం అభివృద్ధి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు పోలాస గోవర్ధన్, మాజీ సర్పంచ్ జీవన్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు ముత్యంరెడ్డి, బూత్ కమిటీ అధ్యక్షుడు వినోద్ పాల్గొన్నారు.

ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి

నవతెలంగాణ-దహెగాం



మండలంలోని హత్తిని గ్రామంలో మండల గౌడ సంఘం ఆధ్వర్యంలో సర్వాయి సర్దార్ పాపన్న గౌడ్ 314వ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గౌడ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కొంద్ర రాజా గౌడ్‌తో పాటు పలువురు గౌడ సంఘ సభ్యులు సర్వాయి పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం కొంద్ర రాజా గౌడ్ మాట్లాడుతూ 11వ శతాబ్దం నాటి బాహుబలి, విప్లవ యోధుడు సర్దార్ పాపన్న గౌడ్ అని అన్నారు. బహుజన రాజ్యాం కోసం ఆయన చేసిన కృషి ఏనలేనిదన్నారు. ఆయన మార్గంలో పయనిస్తూ ఐక్యంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతి గౌడ్ పాల్గొన్నారు.

పనులు నాణ్యతగా చేపట్టాలి

నవతెలంగాణ-సిర్పూర్(టి)



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉపాధి హామీ పథకంలో చేపడుతున్న పనులను ఎలాంటి అవకతవకులకు పాల్పడకుండా సక్రమంగా నిర్వహించాలని మండల ప్రత్యేక అధికారి, డీఎల్‌పీఓ సురేష్ బాబు అన్నారు. మంగళవారం సిర్పూర్ గ్రామ పంచాయతీ పరిధిలో గల రైల్వే స్టేషన్ పాఠశాల, బెస్తవాడ, షేక్ అహ్మద్ గూడ ప్రాంతాల్లో వర్షపు నీటి సంరక్షణ గుంతలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో వర్షపు నీరు ఇంకుడు గుంతల నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంకుడు గుంత నిర్మాణ పనులను నాణ్యత లోపించకుండా చేపట్టాలన్నారు. వర్షపు నీరు వృథా కాకుండా ఇంకుడు గుంతల నిర్మాణాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈయన వెంట ఎంపీడీఓ సత్యనారాయణ, ఏపీఓ చంద్రయ్య, ఇన్‌చార్జి ఎంపీఓ కృష్ణమూర్తి, ఉపాధి హామీ సిబ్బంది నాగేష్, శ్రీనివాస్ ఉన్నారు.

పోలింగ్ సిబ్బంది బాధ్యతగా విధులు నిర్వర్తించాలి

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేష్ ధోత్రే



నవతెలంగాణ-ఆసిఫాబాద్

పార్లమెంట్ ఎన్నికలలో విధులు కేటాయించిన అధికారులు, సిబ్బంది బాధ్యతగా వ్యవహరించి జిల్లాలో ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా సమన్వయంతో పని చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. మంగళవారం జిల్లాలోని బూరుగూడలో గల డా. రాజేంద్రప్రసాద్ బి.ఈడి. కళాశాలలో పోలింగ్ అధికారులు, సహాయ పోలింగ్ అధికారులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల విధులు కేటాయించిన అధికారులు తమ విధుల పట్ల బాధ్యతగా వ్యవహరించాలన్నారు. పోలింగ్ అధికారులు, సహాయ పోలింగ్ అధికారులు పోలింగ్ రోజు, ముందు రోజు చేపట్టాల్సిన విధులను సమర్ధవంతంగా నిర్వహించాలని సూచించారు. ఎన్నికల నిర్వహణలో పోలింగ్ అధికారులు, సహాయ పోలింగ్ అధికారులకు అందించే శిక్షణ ముఖ్యమైనదని, మాస్టర్ ట్రైనర్లు ప్రతి అంశాన్ని అధికారులకు క్షుణ్ణంగా వివరించాలన్నారు. పిఓ డైరీ, 17సి, ఈవీఎం, వీవీ ప్యాట్లపై ఎన్నికల అధికారులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని, పోలింగ్ కేంద్రాలలో ఓటర్ల పట్ల మర్యాదగా వ్యవహరించాలన్నారు. పోలింగ్ రోజున ఏదైనా సమస్య తలెత్తితే వెంటనే సెక్టోరల్ అధికారుల దృష్టికి తీసుకువెళ్లాలని, విధులలో ఏవైనా అనుమానాలు ఉంటే శిక్షణ తరగతులలో నివృత్తి చేసుకోవాలని తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ ఓటు వినియోగం కోసం ఫారం-12ను తప్పనిసరిగా నింపి సమర్పించాలని, పోలింగ్ ప్రక్రియలో డిస్ట్రిబ్యూషన్ సెంటర్లను ముందుగానే చేరుకొని ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను కేటాయించిన ప్రకారంగా సరి చూసుకోవాలన్నారు. ఈ నెల 18న గెజిట్ నోటిఫికేషన్ విడుదలైన నాటి నుండి మే 13న పోలింగ్, జూన్ 4వ తేదీన కౌంటింగ్ పూర్తయ్యే వరకు అధికారులు మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పోలింగ్ కేంద్రాలలో వేసవి దృష్ట్యా ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా పూర్తి సౌకర్యాలను కల్పించాలని ఆదేశించారు. జిల్లాలో ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగే విధంగా సమన్వయంతో పని చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, సిర్పూర్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి దీపక్ తివారి, ఆర్డీఓ సురేష్, తహసీల్దార్ శ్రీనివాస్ రావు దేశ్ పాండే, మాస్టర్ ట్రైనర్లు, పోలింగ్ అధికారులు, సహాయ పోలింగ్ అధికారులు, ఎన్నికల విభాగం అధికారులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై దృష్టి

నవతెలంగాణ-చింతలమానేపల్లి



ఎన్నికల్లో ఓటర్లు సంపూర్ణంగా ఓటు హక్కును వినిపించుకోవాలని కౌటాల సీఐ సాదిక్ పాషా సూచించారు. మంగళవారం మండల కేంద్రంతో పాటు కర్జెల్లి గ్రామాలలో సిఆర్పిఎఫ్ దళాల ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. మండల కేంద్రంలో ఛత్రపతి శివాజీ చౌరస్తా నుండి కుమురం భీం చౌరస్తా వరకు ప్రత్యేక బలగాలతో కవాతు నిర్వహించారు. సిఆర్పిఎఫ్ దళాల ఫ్లాట్ మార్చ్‌ను సీఐ జెండ ఊపి ప్రారంభించారు. అనంతరం సీఐ మాట్లాడుతూ సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి ప్రతి ఒక్కరు పాటించాలని సూచించారు. ఎవరైనా చట్ట విరుద్ధంగా ప్రవర్తించిన గొడవలు సృష్టించిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలంతా వర్గ బేధాలు లేకుండా శాతియుతంగా ఎన్నికలు జరిగేలా సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు నరేష్, విక్రమ్, ఎఎస్సై యాదవ్, సిబ్బంది ఉన్నారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలి

- జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే



రోగులతో మాట్లాడి చికిత్స అందుతున్న తీరును తెలుసుకుంటున్న కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే రోగుల పట్ల వైద్యులు, సిబ్బంది స్నేహపూర్వకంగా ఉంటూ మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి తుకారాంతో కలిసి తనిఖీ చేసి వార్డులు, రిజిస్టర్లు, రికార్డులు, మందుల నిల్వలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆస్పత్రులకు వచ్చే రోగుల పట్ల మానవత్వం కలిగి ఉండాలని, మెరుగైన వైద్య సేవలు అందించాలని తెలిపారు. రోగులకు అందుబాటులో ఉంటూ వారికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా సేవలు అందించాలన్నారు. ఆస్పత్రి పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని, వేసవి ఉష్ణోగ్రత అధికంగా ఉన్నందున ప్రజలు వడదెబ్బకు గురయ్యే అవకాశం ఉందని, ఈ నేపథ్యంలో వడదెబ్బకు గురైన బాధితులకు సరైన చికిత్స అందించాలని ఆదేశించారు. ఇందుకు అవసరమైన ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, మందులను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ఎండ తీవ్రత దృష్ట్యా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపట్టే పని ప్రదేశాలు, వ్యవసాయ పనులకు వెళ్లే రైతులు ఉష్ణోగ్రత తక్కువగా ఉన్న సమయాలలో త్వరగా పనులు పూర్తిచేసుకుని ఇంటికి తిరిగి వచ్చే విధంగా అవగాహన కల్పించాలన్నారు. బయటికి వెళ్లే ముందు తప్పనిసరిగా ఎండ వేడిమి నుండి రక్షణగా గొడుగులు, మాస్క్, టోపీలు వినియోగించేలా తెలియజేయాలన్నారు. వైద్యాధికారులు, వైద్యులు, సిబ్బంది విధులలో సమయపాలన పాటించాలని, రిజిస్టర్లు, రికార్డులలో ఎప్పటికప్పుడు వివరాలు నమోదు చేయాలని ఆదేశించారు. ఆస్పత్రిలో నిర్మిస్తున్న అదనపు గదుల నిర్మాణాన్ని పరిశీలించి పనులను త్వరితగతిన పూర్తిచేసే విధంగా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

కూలి గిట్టుబాటు అయ్యేలా పనులు కల్పించాలి

- అదనపు కలెక్టర్ దీపక్ తివారీ



నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

గ్రామాల్లో వ్యవసాయ పనులు లేనందున కూలీ గిట్టుబాటు అయ్యేలా పనులు కల్పించాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారీ అన్నారు. మంగళవారం కోయవాగులో ఉపాధి హామీ పథకంలో చేపట్టిన ఫారంపండ్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండలు మండిపోతున్నందున పని ప్రదేశాల్లో కూలీలకు చలువ పందిళ్లు, తాగునీరు, ప్రాథమిక చికిత్స కిట్లు అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. కూలీల హాజరు నమోదులో పారదర్శకత పాటించాలన్నారు. వారం, వారం కూలీల వేతనాలు చెల్లించాలని, ఈ విషయంలో ఎలాంటి జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. రైతులకు ఎంతో ఉపయోగమైన కొట్టాలు, పంట కల్లాలు నిర్మించుకునేలా చూడాలని చెప్పారు. పనులకు వచ్చే వారు ఉదయం 11 గంటలలోపు ఇళ్లకు చేరుకోవాలని తెలిపారు. ఆయన వెంట ఎంపీడీఓ రమేష్, ఎంపీఓ గౌరీ శంకర్, ఏపీఓ సోహెబ్, టీఏ, ఎఫ్‌ఏ, కూలీలు ఉన్నారు.

మండుతున్న ఎండలు

- వేడి గాలులతో ఉక్కిరిబిక్కిరి
- నీటి శాతం ఎక్కువగా ఉండే పండ్లకు ప్రాధాన్యత
- జాగ్రత్తలు పాటించాలంటున్న వైద్యులు

నవతెలంగాణ-బెజ్జూర్

రోజురోజుకు ఎండలు మండుతున్నాయి. ఉదయం పది గంటల నుంచే సూర్యుడు తన ప్రతాపాన్ని చూపుతున్నాడు. ఇంటి నుంచి బయటకు వెళ్లాలంటేనే జనాలు జంకుతున్నారు. మధ్యాహ్నం ఉష్ణోగ్రతలు మరింత పెరగడంతో ఎండ వేడిని తట్టుకోలేకపోతున్నారు. ఎండతో పాటు వేడి గాలులు ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. మారుమూల గ్రామీణ ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు మరింత పెరుగుతున్నాయి. ఉదయం పది గంటల నుంచి రాత్రి పది గంటల వరకు వెడి గాలులతో జనాలు ఇబ్బందులు పడుతున్నారు. ఇదే క్రమంలో ప్రజలు ఎండ వేడిమి నుంచి ఉపశమనం పొందేందుకు పండ్లు, పండ్ల రసాలను ఆశ్రయిస్తున్నారు. వేసవి ఎండలతో శరీరంలో నీటి శాతం తగ్గి డిహైడ్రేషన్‌కు గురయ్యే అవకాశం ఉండటంతో అత్యధిక నీటి శాతం ఉన్న వళ్లను తీసుకునేందుకు ప్రాధాన్యతనిస్తున్నారు. ఈ క్రమంలో జనం తర్బూజా, కొబ్బరి బొండాలను తీసుకుంటూ ఉపశమనం పొందుతున్నారు. దీంతో కొద్ది రోజులుగా పట్టణంలో వాటర్ మెలన్, కర్బూజా అమ్మకాలు జోరందుకున్నాయి. రహదారుల వెంట అక్కడక్కడా గుడారాలు వేసుకొని, వాహనాల్లో పెద్ద మొత్తంలో తర్బూజా విక్రయాలు సాగిస్తున్నారు. ప్రస్తుతం ఇవి మార్కెట్లో కిలో రూ.20 చొప్పున విక్రయిస్తున్నారు. వీటితో పాటు కర్బూజా విక్రయాలు సైతం జోరుగా సాగుతున్నాయి. కిలో రూ.50కు విక్రయిస్తున్నారు. ఇక అన్ని కాలాల్లోనూ శరీరానికి వెనువెంటనే శక్తిని ఇచ్చే కొబ్బరి బోండాల విక్రయాలు విరివిగా సాగుతున్నాయి. అన్ సీజన్‌లో 25 నుంచి 30 పలికిన బోండాలు ప్రస్తుతం మార్కెట్ డిమాండ్‌తో రూ.40 నుంచి రూ.50కి చేరింది. అయినప్పటికీ వేసవి దృష్ట్యా జనం వీటి కొనుగోళ్లు చేస్తూ ఉపశమనం పొందుతున్నారు. అటు ఎండ తీవ్రతల నుంచి రక్షణ పొందేలా ప్రతి ఒక్కరూ అధిక నీటి శాతం ఉండే పండ్లను తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. అదే విధంగా వడ దెబ్బ తగలకుండా పూర్తి జాగ్రలు పాటించాలని పేర్కొన్నారు.



బెజ్జూర్ మండల కేంద్రంలో మధ్యాహ్నం నిర్మానుష్యమైన రోడ్డు

జాగ్రత్తలు పాటిస్తూ బయటకు రావాలి : డాక్టర్ రుషీ



ప్రస్తుతం వేసి ఎండలు 40 నుంచి 43 డిగ్రీలకు చేరిన క్రమంలో శరీరం డిహైడ్రేషన్కు గురవుతోంది. ఎండ తీవ్రతల నుంచి రక్షణ పొందేలా వీలైంతన వరకు ప్రజలు ఇళ్లలోనే ఉండాలి. అత్యవసరమైతే తగు జాగ్రత్తలు తీసుకొని బయటకు రావాలి. వేసవిలో తెల్లరంగు వదులు దుస్తులు ధరించడం మంచిది. ఇక శరీరం నిర్జలీకరణకు గురికాకుండా ఉండాలంటే వాటర్ మిలన్, కర్బూజా లాంటి పండ్లతో పాటు పండ్ల రసాలు... కొబ్బరి బోండాలు... ఇతర ద్రవ పదార్థాలను అధికంగా తీసుకోవాలి. అలాగే నూనె పదార్థాలకు దూరంగా ఉండాలి. బయటకు వెళ్లే సమయంలో విధిగా వెంట నీటితో పాటు ఓఆర్ఎస్ ప్యాకెట్ లేదా ఉప్పు, నిమ్మకాయ కలిపిన నీటిని తీసుకువెళ్లాలి.

రైతులు నాణ్యత పాటించాలి

నవతెలంగాణ-కౌటాల

రైతులు నాణ్యత పాటించాలి అని సహకార సంఘం కేంద్రం సీఈఓ రాజేష్ అన్నారు. మండలంలోని విరవెళ్లి, సాండ్‌గావ్ గ్రామాలలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏపీఎం ముక్తేశ్వర్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి పంట పండించిన రైతులు వారి పంటను వరి కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని సూచించారు. రైతులు నాణ్యత ప్రమాణాలు పాటించి పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు పొందాలని సూచించారు. పట్టా పాస్ పుస్తకం, ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా జిరాక్స్ ప్రతులను రెండు సెట్లు తీసుకురావాలని తెలిపారు. దళారులకు అమ్మి రైతులు మోసపోవద్దని, కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకొని రైతులు లాభ పడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు, రైతులున్నారు.

బెజ్జూర్ : మండల కేంద్రంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం మండల రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ సంతోష్, సీనియర్ అసిస్టెంట్ అచ్యుత రావు ప్రారంభించారు. రైతులు కొనుగోళు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర్ గౌడ్, సెంటర్ ఇన్‌చార్జి పర్ష సంజీవ్ కుమార్, సిబ్బంది దేవాజి, రైతులు పాల్గొన్నారు.

సిర్పూర్(టి) : రైతులు యాసంగి సీజన్‌లో పండించిన వరి ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే అమ్ముకోవాలని డీపీఎం రామకృష్ణ అన్నారు. మంగళవారం మండలంలోని లోనవెల్లీ గ్రామంలో వరి కొనుగోళ్ల కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వం ఏ గ్రేడ్ వరి ధాన్యానికి ధర రూ.2203, సాధారణ వరి ధాన్యానికి రూ.2183 ఇస్తుందన్నారు. రైతులు తమ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చేటప్పుడు, ఆధార్ కార్డ్, పట్టా పాస్ బుక్, ఆయా సెక్టార్ల ఏఈఓలు ధ్రువీకరించిన పత్రాన్ని తమవెంట తీసుకొని రావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల ఏపీఎం దుర్గయ్య, సీసీ రాజేష్, గ్రామ సంఘం సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

దహెగాం : వరి ధాన్యాన్ని దళారులకు అమ్మి మోసపోవద్దని పీఏసీఎస్ సీఈఓ బక్కయ్య అన్నారు. మంగళవారం మండలంలోని లగ్గం, ఒడ్డుగూడ, గిరవెల్లి గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ గ్రేడ్ ధాన్యానికి రూ.2203 కామన్ రకానికి రూ.2183 చెల్లిస్తామన్నారు. రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది నారాయణ, జీవన్, సాయి పాల్గొన్నారు



కౌటాల



బెజ్జూర్



సిర్పూర్(టి)



దహెగాం

శాంతియుత ఎన్నికలే పోలీసుల లక్ష్యం

- ఏఎస్పీ ప్రభాకర్ రావు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

శాంతియుతంగా ఎన్నికలు నిర్వహించడమే పోలీసుల లక్ష్యమని, ప్రతి ఓటరు తప్పనిసరిగా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని ఏఎస్పీ ప్రభాకర్ రావు సూచించారు. మండలంలోని రౌటసంకెపల్లి, అడ్డాఘాట్, ఈదులవాడ గ్రామాల్లో డీఎస్పీ సదయ్య, సీఐ సతీష్ ఆధ్వర్యంలో కేంద్ర బలగాలతో నిర్వహించిన పోలీసుల కవాతులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల పట్ల ప్రజల్లో ఉన్న భయాన్ని తొలగించే ఉద్దేశంతో పోలీసుల కవాతు నిర్వహించామన్నారు. రాబోయే లోక్‌సభ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించడమే తమ లక్ష్యమని అన్నారు. మందిరాలు, విద్యాసంస్థల్లో ఎన్నికల ప్రచారాలు నిర్వహించడం నిబద్ధంలకు విరుద్ధమన్నారు. ఓటర్లు నిష్పాక్షికంగా ఓటు వేసినప్పుడే దేశం బాగుపడుతుందన్నారు. ఓటు వేయడానికి మద్యం, డబ్బులు లాంటి ప్రలోభాలకు గురికాకూడాదని సూచించారు. ఎన్నికలకు సంబంచిన ఫిర్యాదుల కోసం టోల్ ఫ్రి నంబర్ 1950కు కానీ, సి-విజిల్ యాప్‌ను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో సిఆర్పిఎఫ్ ఇన్స్‌పెక్టర్ బద్రిప్రసాద్, ఎస్సైలు రాజేశ్వర్, ప్రవీణ్ పాల్గొన్నారు.

ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి

నవతెలంగాణ- రెబ్బెన

మండల కేంద్రంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం సర్వాయి సర్దార్ పాపన్న గౌడ్ 314వ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్దార్ పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు అనంతరం గౌడ సంఘం కుమురం భీం జిల్లా అధ్యక్షులు మోడెం సుదర్శన్ గౌడ్ మాట్లాడుతూ 11వ శతాబ్దం నాటి బాహుబలి, విప్లవ యోధుడు సర్దార్ పాపన్న గౌడ్ అని కొనియాడారు. 400 ఏండ్లు దాటిన ఆయన పేరును తెలంగాణ ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్నాడన్నారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఆశయాలు కొనసాగిస్తూ గౌడ కులస్తులు ఐకమత్యంతో ముందుకు సాగాలని కోరారు. ఈ కార్యక్రమంలో రెబ్బెన గౌడ సొసైటీ అధ్యక్షుడు తాళ్లపల్లి కిష్టా గౌడ్, సభ్యులు మడ్డి శ్రీనివాస్ గౌడ్, మోడం చిరంజీవి గౌడ్, అన్నపూర్ణ మురళి గౌడ్, పందిర్ల స్వామి గౌడ్, మోడం సర్వేశ్వర్ గౌడ్, రామన్న, ఉమేష్, తిరుపతి గౌడ్, భాస్కర్ గౌడ్, సాయికిరణ్, విజయ్ గౌడ్ పాల్గొన్నారు.



నిషేధిత గుడుంబా క్రయవిక్రయాలపై చర్యలు

• భీమారం ఎస్ఐ రాములు

నవతెలంగాణ జైపూర్



నిషేధిత గుడుంబా తయారుచేసిన, విక్రయించిన చట్టపరంగా శిక్షార్హులని భీమారం ఎస్సై రాములు హెచ్చరించారు. మంగళవారం భీమారం మండల కేంద్రంలోని కొత్తగూడెం కాలనీకి చెందిన దబ్బెట రాములు, లంబడి తండాకు చెందిన తేజావత్ తుకారం గుడుంబా అముతు పట్టుబడ్డట్టు తెలిపారు. పట్టుబడి ఇరువురిపై కేసు నమోదు చేసినట్లు తెలిపిన ఆయన నిషేధిత గుడుంబా తయారుచేసిన అమ్మిన చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.

తండ్రి మందలించాడని బాలుడి ఆత్మహత్య

నవతెలంగాణ-రామకృష్ణాపూర్

మంచిగా చదువుకోవాలని తండ్రి మందలించడంతో ఉరి వేసుకొని బాలుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన పట్టణంలోని స్థానిక రామాలయంలో చోటుచేసుకుంది. తండ్రి రామకృష్ణ ఫిర్యాదు మేరకు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మతుడు సెగ్గం మోహన్ కుమార్(17)హైదరాబాద్ లోని పాలిటెక్నిక్ కాలేజీలో చదువుతున్నాడు. తండ్రి బాగా చదువుకోవాలని చాలాసార్లు మందలించాడు. మోహన్ కుమార్ చదువు మీద శ్రద్ధ ఉండకపోవడంతో ఎప్పుడు ఇంట్లో ఒక రూమ్‌లో కూర్చొని మొబైల్ ఫోన్ చూస్తుండేవాడు. సోమవారం తండ్రి మందలించడంతో మనస్థాపానికిలోనై ఇంట్లో ఉరేసుకున్నాడు. తండ్రి తలుపు తీసి చూసే సరికి మోహన్ కుమార్ ఉరేసుకొని ఉన్నాడని తెలిపారు. చికిత్స నిమిత్తము ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా డాక్టర్లు చనిపోయారని నిర్ధారించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్ఐ జి.రాజశేఖర్ తెలిపారు.

గ్రామస్తుల సహాయ సహకారాలు మరువలేను



నవతెలంగాణ-జైపూర్

కిష్టాపూర్ గ్రామపంచాయతీ ప్రభుత్వ పాఠశాలలో సుదీర్ఘకాలం ప్రధానోపాధ్యాయులుగా విధులు నిర్వర్తించిన నాకు గ్రామ ప్రజలు అందించిన సహాయ సహకారాలను మరువలేనని నరహరి వనజరెడ్డి అన్నారు. ప్రతి 12 సంవత్సరాలు విద్యా బోధన చేసి పదవీ విరమణ పొందుతున్న ప్రధానోపాధ్యాయులు వనజారెడ్డిని గ్రామస్తులు మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు తన వంతుగా పెన్నులు నోటుబుక్కులు స్కూల్ బ్యాగులు అందజేశారు. అదేవిధంగా పాఠశాల మధ్యాహ్న భోజనం కార్మికురాలు బొంగోని మంజుల కూతురు వివాహానికి రూ.25000 ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులతో పటు పూర్వ విద్యార్థులు గ్రామస్తులు మధ్యాహ్న భోజన కార్మికులు కేక్ కట్ చేసి స్వీట్లు పంచుకున్నారు. అదేవిధంగా పదవి విరమణ పొందిన వనజారెడ్డిని శాలువాలతో ఘనంగా సన్మానించారు.

యువతి వివాహానికి చేయూత



నవతెలంగాణ-నస్పూర్

నిరుపేద యువతి వివాహానికి ప్రజాసేవ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం ఆర్థిక సాయం అందజేశారు. నస్పూర్‌లోని యాదగిరి, రాజక్క దంపతులకు ఇద్దరు సంతానం. వృత్తిరీత్యా కూలిపని చేసుకుని జీవనం సాగిస్తున్నారు. వారి కూతురు పెళ్లి కుదిరిందని తెలియడంతో వెంటనే సభ్యులంతా కలిసి కొద్దిమంది దాతల సహకారంతో బీరువా, కూలర్, బియ్యం, స్టూల్స్‌ని వారికి అందించారు. అనంతరం వ్యవస్థాప అధ్యక్షుడు షేక్ అజీమోద్దీన్ మాట్లాడుతూ పేద ప్రజలకు ఎలాంటి కష్టం వచ్చినా సొసైటీ తరపున వారికి ఏదో రూపకంగా సహకారం ఉంటుందని తెలిపారు. గతంలో కరోనా సమయంలో కూడా చనిపోయిన వారికి అంత్యక్రియలు కూడా చేయడం జరిగిందని, అలాగే ఈ కుటుంబానికి అన్ని వేళల సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు సుద్దాల ప్రభు దేవ్, మందమర్రి పట్టణ అధ్యక్షులు నదిపాట రాజు, జిల్లా కార్యదర్శి గంధ్ల సంజీవ్, ఎండీ జావిద్ పాషా, కాసిపేట చరణ్, సుధీర్, సుజీత్, దెబ్బడి సాయి, దేప్పటి రవి, దోమట్టి సతీష్, సన్నీ పాల్గొన్నారు.

నూతన కార్పొరేట్ పాఠశాలలకు అనుమతులు ఇవ్వొద్దని వినతి



నవతెలంగాణ-నస్పూర్

మంచిర్యాల జిల్లా వ్యాప్తంగా 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి పలు ప్రయివేటు కార్పొరేట్ విద్యాసంస్థలు తిష్ట వేయడానికి సిద్ధంగా ఉన్నాయని వాటికి అనుమతులు ఇవ్వకూడదని డిమాండ్ చేస్తూ మంగళవారం పీడీఎస్‌యూ, ఏబిఎస్‌బీ విద్యార్థి సంఘం నాయకులు జిల్లా విద్యాశాఖ అధికారి యాదయ్యకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ నాయకుడు డి. శ్రీకాంత్, ఏబిఎస్‌బీ జిల్లా కనుకుంట్ల సన్నీ గౌడ్ మాట్లాడుతూ కొన్ని కార్పొరేటు, ప్రయివేట్ విద్యా సంస్థలు అనుమతులు లేకున్నప్పటికీ పలు ప్రాంతాల్లో అక్రమంగా అడ్మిషన్లు చేస్తున్నారని, విద్యార్థులను విద్యార్థుల తల్లిదండ్రులను మోసం చేస్తున్నారన్నారు. అటువంటి పాఠశాలకు అనుమతులు ఇవ్వకూడదన్నారు. గతంలో కూడా కొన్ని పాఠశాలలు అనుమతులు లేకుండా తరగతులు నిర్వహించడంతో పలువురు విద్యార్థులు ఆ విద్యా సంవత్సరాన్ని పూర్తిగా నష్టపోవాల్సి వచ్చిందని గుర్తు చేశారు. గద్దరాగడిలోని గ్రీన్ వుడ్ పాఠశాలపై క్రిమినల్ కేసు నమోదు అయిందని వచ్చే సంవత్సరం నుంచి ఆ పాఠశాలకు గుర్తింపు రద్దు చేయాలన్నారు.

కోల్ ఇండియా కబడ్డీ పోటీలకు శ్రీరాంపూర్ క్రీడాకారుడు ఎంపిక

నవతెలంగాణ-నస్పూర్

కోల్ ఇండియా కబడ్డీ పోటీలకు శ్రీరాంపూర్ కబడ్డీ క్రీడాకారుడు కొండ కార్తీక్ ఎంపికయ్యాడు. ఏప్రిల్ 4 నుంచి 6 వరకు సింగ్రోలి జిల్లా కొక్రి ఏరియా గ్రామంలో జరిగే కోల్ ఇండియా పోటీలకు సింగరేణి నుంచి ఎంపికయ్యాడు. కార్తీక్ ఆర్కె-7 గనిలో కోల్ కటర్‌గా విధులు నిర్వహిస్తూ కబడ్డీ క్రీడలో జిల్లా స్థాయి, రాష్ట్ర స్థాయి, జాతీయ స్థాయిలో మంచిర్యాల జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. కోల్ ఇండియాలో సింగరేణి కంపెనీ నుంచి చాలాసార్లు ప్రతినిధ్యం వహించి జిల్లాకు, రాష్ట్రానికి, కంపెనీలో పేరు తెచ్చుకున్నందుకు జిల్లా కబడ్డీ సెక్రెటరీ రాంచందర్, డీవైఎస్‌ఓ రాజ్ వీర్, ఒలంపిక్ సెక్రెటరీ రఘునాథరెడ్డి, శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ సంజీవరెడ్డి అభినందించారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపట్టాలి

• మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్

నవతెలంగాణ నస్పూర్



జిల్లాలో తాగునీటి ఎద్దడి లేకుండా అధికారులు చర్యలు చేపట్టాలని మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా అదనపు కలెక్టర్‌లు బి.రాహుల్, సబావత్ మోతిలాల్, ప్రత్యేక డిప్యూటీ డి.చంద్రకళ, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు, జడ్పీ సీఈఓ గణపతి వివిధ శాఖల అధికారులతో తాగునీటి సరఫరా, వరిధాన్యం కొనుగోలు కేంద్రాలు వడదెబ్బల నియంత్రణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రజలకు నిరంతర తాగునీటి సరఫరాకు అదనపు కలెక్టర్ నోడల్ అధికారిగా వ్యవహరిస్తారని, మండల, గ్రామ, వార్డు స్థాయిలలో ప్రత్యేక అధికారులను నియమించి, అవసరమైన కార్యచరణ రూపొందించి చేతిపంపులు, బోర్వెల్ల మరమ్మత్తులను చేపట్టడం జరిగిందని, ఇంకా సమస్యలు ఉన్న వాటిపై దృష్టి సారించి త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు. మిషన్ భగీరథ ద్వారా ప్రతి ఇంటికి తాగునీరు అందేలా చూడాలని, పైప్‌లైన్ల లీకేజీలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. బోర్వెల్లు, నల్లా కనెక్షన్ల ద్వారా తాగునీరు సరఫరా చేయలేని ప్రాంతాలకు ప్రత్యామ్నాయ పద్ధతిలో వాటర్ ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయడం జరుగుతుందని, ఈ క్రమంలో నీటి సరఫరా లేని ప్రాంతాలను గుర్తించి అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జిల్లాలో కేటాయించబడిన 262 వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ఈ నెల 5వ తేదీ లోగా పూర్తి స్థాయిలో ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని, ఇందులో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థకు 106, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు 130, డీసీఎంఎస్‌కు 27 కొనుగోలు కేంద్రాలను కేటాయించడం జరిగిందని, మండల ప్రత్యేక అధికారులు, వ్యవసాయ అధికారులు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు సమన్వయంతో పని చేసి వరిధాన్యం కొనుగోలు ప్రక్రియలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పర్యవేక్షించాలని తెలిపారు.

ఉద్యోగోన్నతులు ఆపడం సరికాదు

• వాసిరెడ్డి సీతారామయ్య



నవతెలంగాణ-నస్పూర్

ఎన్నికల కోడ్ పేరుతో ప్రతి సంవత్సరం కార్మికులకు ఇచ్చే క్యాటగిరి ప్రమోషన్లను ఆపడం సరైనది కాదని సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) రాష్ట్ర అధ్యక్షుడు, శాశ్వత వేజ్ బోర్డ్ సభ్యులు వాసిరెడ్డి సీతారామయ్య అన్నారు. మంగళవారం ఎస్ఆర్‌పీ-3 ఫిట్ కార్యదర్శి మురళి చౌదరి అధ్యక్షతన నిర్వహించిన గేట్ మీటింగ్‌లో అయన పాల్గొని మాట్లాడారు. సింగరేణి యాజమాన్యం గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు జరిగి మూడు నెలలు అవుతున్న ఇప్పటికీ గుర్తింపు పత్రం అందజేయలేదన్నారు. దీనివల్ల గత గుర్తింపు సంఘం వైఫల్యం వల్ల సింగరేణిలో అనేక సమస్యలు పేరుకుపోయి ఉన్నాయని, గుర్తింపు పత్రం అందజేయడం వల్ల స్ట్రక్చర్ సమావేశాలలో కార్మికుల సమస్యలు పరిష్కారమయ్యే అవకాశం ఉందని, వెంటనే యాజమాన్యం గుర్తింపు పత్రం అందజేయాలని వారు ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ గుర్తింపు సంఘంగా గెలిచిన తర్వాత ఎటువంటి అవినీతికి తావు లేకుండా యాజమాన్యం పంచన చేరకుండా కార్మికుల పక్షాన నిలబడి కార్మికులు ఏదైనా డివిజన్ కొరకు ట్రాన్స్ఫర్ దరఖాస్తు చేసుకుంటే ఎటువంటి అవినీతి లేకుండా కార్మికులను ట్రాన్స్ఫర్ చేయించడం జరిగిందని అన్నారు. సింగరేణి కార్మికుల పిల్లలకు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సీబీఎస్ఈ సెలబస్‌తో విద్యను అందించేందుకు యాజమాన్యాన్ని ఒప్పించడం జరిగిందన్నారు. గత గుర్తింపు సంఘం వైఫల్యం వల్ల సింగరేణి మునగడే ప్రశ్నార్థకంగా మారిందని సింగరేణి సంస్థకు భవిష్యత్తు ఉండాలంటే నూతన గనులు కావాలని ఎన్నికల్లో గెలిచిన వెంటనే రాష్ట్ర ప్రభుత్వానికి వినతి పత్రం అందజేశామని, భవిష్యత్తులో కార్మికులకు ఇచ్చిన హామీ మేరకు సొంత ఇంటి పథకం, పెరిక్స్ పై ఐటి మినహాయింపు కార్మికులు, వారి కుటుంబ సభ్యులకు కార్పొరేట్ ఆస్పత్రి నిర్మాణానికి ఏఐటీయూసీ కృషి చేస్తుందన్నారు. భవిష్యత్తులో చేసే పోరాటాలకు అందోళన కార్యక్రమాలకు కార్మికుల మద్దతు తెలిపి కార్మికుల సమస్యల పరిష్కారంలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ముస్కే సమ్మయ్య, శ్రీరాంపూర్ బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కే బాజీ సైదా, బ్రాంచ్ సహాయ కార్యదర్శి మోత్కూరి కొమురయ్య, ఫిట్ కార్యదర్శి మురళి చౌదరి, మైనింగ్ స్టాఫ్ నాయకులు మారేపల్లి బాబు, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ బెల్లంపల్లి రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్ ఖాన్, ఫిట్ నాయకులు తవటం మల్లేష్, అంబాల రవి, సురేష్, విక్కీ, గాజుల ప్రభాకర్, లక్ష్మీనారాయణ, రోమోజీ, సారయ్య గోపి, రమేష్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే గ్రామాల అభివద్ధి సాధ్యం

• పేదల సమస్యలపై పార్లమెంటులో ప్రశ్నించే గొంతుకనవుతా

• ఆదిలాబాద్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ



నవతెలంగాణ-జన్నారం

కాంగ్రెస్ పార్టీతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందని, పేదల పక్షాన పార్లమెంటులో తమ గొంతును వినిపిస్తామని, ఆదిలాబాద్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ అన్నారు. మంగళవారం మండలంలోని పైడిపల్లి గార్డెన్‌లో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు, ముజాఫర్ అలీ ఖాన్ అధ్యక్షతన నిర్వహించిన, కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ తనను గుర్తించి ఎంపీ టికెట్ ఇచ్చిందని, ఈ ప్రాంత వాసులంతా కలిసికట్టుగా ఉండి తమను ఎంపీగా గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ పథకాలను కార్యకర్తలకు ప్రజలకు వివరించాలన్నారు. ఆదిలాబాద్ పార్లమెంటు నియోజక వర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామన్నారు. ప్రజలు తమకు ఎంపీగా గెలిపించి అభివృద్ధి చేసే అవకాశం కల్పించాలన్నారు. ప్రతి పేదవానికి అండగా నిలుస్తామన్నారు. ఈ ప్రాంత ఆడబిడ్డగా తనను, ప్రజలు ఆదరించి ఆశీర్వదించి, ఎంపీగా గెలిపించాలన్నారు. సీనియర్ జూనియర్



తేడా లేదు కలిసికట్టుగా పనిచేసే సుగుణను గెలిపించాలని ఎమ్మెల్యే బొజ్జు అన్నారు. సీనియర్ కార్యకర్త జూనియర్ కార్యకర్త అనే తేడా లేకుండా, వర్గ విభేదాలు లేకుండా అందరూ కలిసికట్టుగా ఉండి ఆదిలాబాద్ ఎంపీగా ఆత్రంసుగుణను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. గత ఎమ్మెల్యే ఎన్నికల్లో కొంతమంది నాయకులు తమకు వెన్నుపోటు పొడిచారని, వారిని క్షమించి వదిలేస్తున్నామన్నారు. ఈ సారైనా అలాంటి పొరపాట్లు చేయకుండా, కాంగ్రెస్ చేతి గుర్తుకు ఓటు వేసి అదిలాబాద్ ఎంపీ అభ్యర్థి సుగుణను గెలిపించాలన్నారు. సరస్వతి కెనాల్ ద్వారా రైతులకు నీళ్ల ఇచ్చి ఆదుకుంటామన్నారు. మండల కేంద్రంలో సెంట్రల్ లైటింగ్ సిస్టం ఏర్పాటు చేస్తున్నామన్నారు. కడెం ప్రాజెక్టు మరమ్మతుల కోసం నిధులను కేటాయించామన్నారు. రేవంత్‌రెడ్డి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాపై ప్రత్యేక శ్రద్ధ చూపి అభివృద్ధి చేసే దిశగా కృషి చేస్తున్నారని అన్నారు. అనంతరం పలువురు బీఆర్ఎస్, బీజేపీ నాయకులు ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు సుభాష్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, మిక్కిలినేని రాజశేఖర్, రాజన్న, ఇసాక్, ముత్యం సతీష్, పసివుల్లా, రియాజుద్దీన్, హజారుద్దీన్, సిద్ధం చంద్రయ్య, ఈర్నాల గంగన్న, సుధాకర్ నాయక్ షాకీర్, నందు నాయక్, దుమల రమేష్ ఇందయ్యా పాల్గొన్నారు.

శ్రీరాంపూర్ బ్రాంచ్ నూతన కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-నస్పూర్

సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్(సీఐటీయూ) శ్రీరాంపూర్ బ్రాంచ్ నూతన కమిటీని రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాజారెడ్డి, నరసింహారావు ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ శ్రీరాంపూర్ బ్రాంచ్ సెక్రటరీగా కొనసాగుతున్న గోదారి భాగ్యరాజును యూనియన్ క్రమశిక్షణ చర్యలలో భాగంగా ఆ పదవి, యూనియన్ నుంచి తొలగించడం జరిగిందని ఎవరైనా యూనియన్ ప్రతిష్టకు భంగం కలిగించకుండా సమిష్టి నిర్ణయాలకు వ్యతిరేకంగా పనిచేసినట్లయితే తొలగించబడతారని అన్నారు. ఆ స్థానంలో హెడ్ ఓవర్ మెన్‌గా ఐకె 1ఏ లో పనిచేస్తున్న అంబాల శ్రీనివాస్‌ను నూతన బ్రాంచ్ కార్యదర్శిగా నియమించడంతో పాటు అధ్యక్షులుగా గుల్ల బాలాజీ, చీఫ్ ఆర్గనైజర్‌గా వెంగళ శ్రీనివాస్, కోశాధికారిగా కస్తూరి చంద్రశేఖర్, వైస్ ప్రెసిడెంట్‌గా సాయిళ్ళ శ్రీనివాస్, పెరక సదానందం, తోడే సుధాకర్, బోడకుంట శంకర్, అజయ్, ఎం శ్రీధర్, సిరికొండ శ్రీనివాస్, అవునూరి మహేష్, ఇత్తినేని వెంకటేష్, అభిలాష్, మిడివెల్లి శ్రీనివాస్, శ్రీపతి బానేష్, ఆర్గనైజర్‌గా కేసిపెద్ది శ్రీనివాస్‌లను ఎన్నుకున్నారు.



ఉపాధి హామీ పనులపై సమీక్షా సమావేశం



నవతెలంగాణ-వేమనపల్లి

మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం ఎంపీడీఓ దేవేందర్‌రెడ్డి అధ్యక్షతన పంచాయతీ కార్యదర్శులకు, ఉపాధి హామీ సిబ్బందికి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని గ్రామ పంచాయతీలలో కూలీలకు పనులు కల్పించి, 100 రోజులు పూర్తి అయ్యేలా చూడాలని అన్నారు. ప్రతి కూలీకి రోజు కూలి రూ.300 అందేలా మార్కింగ్ ఇచ్చి పని జరిగేలా చూడాలని ఆదేశించారు. అన్ని గ్రామ పంచాయతీలలో వచ్చే హరితహారం నాటికి మొక్కలు సిద్ధం చేయాలని అదే విధంగా పల్లె ప్రగతి కార్యక్రమాలు నిరంతరం చేయాలని తెలియచేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ శ్రీపతి బాపు రావు, ఏపీఓ సత్య ప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు, సాంకేతిక సహాయకులు, కంప్యూటర్ ఆపరేటర్‌లు, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ వర్ధంతి



నవతెలంగాణ-మందమర్రి

పాత బస్టాండ్ ప్రాంతంలోని రేణుక ఎల్లమ్మ తల్లి దేవాలయంలో మంగళవారం సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా గౌడ సంఘం ఉపాధ్యక్షులు నోముల ఉపేందర్ గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి మడిపల్లి వెంకటేశ్వర గౌడ్ మాట్లాడుతూ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం కిలాస్పూర్ గ్రామంలో జన్మించారని తెలిపారు. 17వ శతాబ్దంలో దక్కన్ గడ్డపై మొదటి సారిగా బహుజన రాజ్యాన్ని స్థాపించిన తొలి బహుజన పోరాట యోధులని, ఢిల్లీ పీఠాన్ని గడగడలాడించిన ఔరంగ జేబుకు ముచ్చెమటలు పట్టించిన పోరాటవీరుడు, 12 మందితో ఉన్న సైన్యాన్ని 12000 మందిని తయారు చేసిన ఘనత సర్దార్ సర్వాయి పాపన్న సొంతం అన్నారు. సర్దార్ సర్వాయి పాపన్న ఆశయాలను ప్రతీ ఒక్కరూ కొనసాగించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు రవీందర్, భాస్కర్, రాజకుమార్, పోష గౌడ్, రాజయ్య నరసయ్య పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని మారుస్తామంటున్న బీజేపీకి బుద్ధి చెప్పాలి

• జేబీఎస్‌డీ జిల్లా అధ్యక్షుడు గజెల్లి లక్ష్మణ్



నవతెలంగాణ-జైపూర్

బాబా సాహెబ్ అంబేద్కర్ రచించిన భారత రాజ్యాంగాన్ని మారుస్తామని బెదిరింపులకు పాల్పడుతున్న బీజేపీకి లోకసభ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని జై భీమ్ సైనిక్ దళ్ జిల్లా అధ్యక్షుడు గజెల్లి లక్ష్మణ్ అన్నారు. మంగళవారం చెన్నూర్ నియోజకవర్గంలోని కోటపల్లి, చెన్నూర్, భీమారం, జైపూర్ మండల కేంద్రాల్లో రాజ్యాంగ రక్షణ యాత్ర కరపత్రాలను రాష్ట్ర అధికార ప్రతినిధి పైడిమల్ల నర్సింగ్‌తో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే లోకసభ ఎన్నికల్లో దేశవ్యాప్తంగా 400 ఎంపీ స్థానాలను గెలిపించుకొని భారత రాజ్యాంగాన్ని మారుస్తామని బీజేపీ ప్రకటించడం సరికాదన్నారు. రాబోయే ఎన్నికల్లో ఆ పార్టీకి కాకుండా వేరే ఇతర పార్టీలకు ఓటు వేసి గెలిపించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ అధ్యక్షుడు అద్దంకి దయాకర్ పిలుపుమేరకు రాష్ట్ర అధ్యక్షులు పిల్లి సుధాకర్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఏప్రిల్ 2న అలంపూర్‌లో ప్రారంభించి ఏప్రిల్ 8న హైదరాబాద్‌కు యాత్ర చేరుకుంటుందని తెలిపారు. ఈ నెల 5న మంచిర్యాల జిల్లా కేంద్రానికి చేరుకోనున్న యాత్రను విజయవంతం చేయడానికి గిరిజన, మైనారిటీ, మేధావులు, అంబేద్కర్ వాదులు అత్యధికంగా హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో జేబీఎస్‌డీ చెన్నూరు నియోజకవర్గ అధ్యక్షుడు శీలం వెంకటేశం జైపూర్ మండల అధ్యక్షుడు పరమేశ్వర్, మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు ఎర్రోళ్ల నరేష్, నియోజకవర్గం అధ్యక్షుడు రామస్వామి పాల్గొన్నారు.

బాధిత రైతు కుటుంబానికి మేకల పంపిణీ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్



ఆత్మహత్య చేసుకున్న మండలంలోని లోకారి గ్రామానికి చెందిన సంతోషం శ్రీనివాస్ కుటుంబానికి మంగళవారం రూ.22వేలు విలువ చేసే మేకలను కిసాన్ బంధు రాష్ట్ర అధ్యక్షులు సతీష్ సహకారంతో దీప్తి మనోహర్ యాదవ్ ఆర్థిక సాయంతో రైతుస్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షులు సంగెపు బొర్రన్న ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రాకేష్, మహేందర్, రవీందర్, స్వామి పాల్గొన్నారు.

ఖైరిగూడ ఓసీపీ పీఓకు సన్మానం

నవతెలంగాణ-రెబ్బెన



బెల్లంపల్లి ఏరియాకు సింగరేణి నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను సింగరేణి అధికారులు కార్మికులు సమిష్టి కృషితోనే అధిగమించినందుకు మంగళవారం ఖైరిగూడ ఓసీపీ ప్రాజెక్టు ఆఫీసర్ సత్యనారాయణను సన్మానించారు. ప్రాజెక్టు ఇంజనీర్ వీరన్న, ఖైరిగూడ మేనేజర్ ప్రవీణ్ పాంటింగ్, ఏఐటీయూసీ గోలేటి బ్రాంచ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ గోలేటి బ్రాంచ్ కార్యదర్శి ఎస్ తిరుపతి, పిట్ కార్యదర్శి మారం శ్రీనివాస్, ఆర్గనైజింగ్ సెక్రటరీ బి దివాకర్, ఏరియా ఇన్‌చార్జి రాయిని రాజయ్య, నాయకులు తోట మల్లేష్, రాజశేఖర్, నరేష్, వినోద్, ధనలక్ష్మి, సంధ్య, ప్రేమలత, శకంతల పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలి

- అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్



నవతెలంగాణ-ముథోల్

వేసవికాలం దృష్ట్యా గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా తగు చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అన్నారు. మండలంలోని ఆష్టా, రువ్వి గ్రామాలను మంగళవారం సందర్శించారు. ఇటీవల ఆ గ్రామాల్లో మిషన్ భగీరథ పైపు లైన్లు లీకేజీ కావడంతో సంబంధిత అధికారులు మరమ్మతులు చేయించారు. అనంతరం వాటిని పరిశీలించారు. తాగునీటి సరఫరా నిమిత్తం మిషన్ భగీరథ ద్వారా అందుబాటులో ఉన్న వ్యవస్థను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలన్నా రు. తాగునీటి సరఫరాను మండల, గ్రామస్థాయిలో ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పర్యవేక్షించాలన్నారు. ప్రత్యేక అధికారులు వారంలో రెండుసార్లు, పంచాయతీ కార్యదర్శులు ప్రతి రోజు ఉదయం 8గంటలకు గ్రామపంచాయతీలో ఉండాలన్నారు. మిషన్ భగీరథ వ్యవస్థ, స్థానికంగా అందుబాటులో ఉన్న నీటి వనరులతో రూపొందించిన ప్రత్యామ్నాయ వ్యవస్థలను వినియోగించుకుంటూ గ్రామస్థాయిలో రానున్న రెండు నెలలకు తాగునీటి సరఫరా కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు. ప్రతి గ్రామపంచాయతీలో ఇంటి పన్ను వందశాతం పూర్తి చేయాలన్నారు. రువ్విలో వందశాతం ఇంటి పన్ను వాసులికాగా అష్టాలో 96 శాతం అయినట్లు కార్యదర్శులు అదనపు కలెక్టర్‌కు తెలిపారు. ఈ సందర్భంగా పలు పంచాయతీ రికార్డులు పరిశీలించారు. ఆయన వెంట డీపీఓ శ్రీనివాస్, డీఎల్పీఓ మొజం హుస్సేన్, డీఈఈ లక్ష్మణ్, ఏఈ అరుణ్ కుమార్, ఎంపీడీఓ రాములు, ఎంపీఓ అమీర్‌ఖాన్, పంచాయతీ కార్యదర్శులు పోతన్న, బానుగౌడ్ ఉన్నారు.

పూర్వ ప్రాథమిక స్థాయి విద్య బోధన అందించడమే తమ లక్ష్యం

- అంగన్వాడీ ఉపాధ్యాయురాలు శారద

నవతెలంగాణ-ఎడపల్లి

అంగన్వాడీ కేంద్రలో నమోదైన చిన్నారి బాలబాలికలకు పూర్వ ప్రాథమిక విద్యా స్థాయి బోధన అందించడమే తమ లక్ష్యమని ఎడపల్లి మండలం దుబ్బ తండ అంగన్వాడి ఉపాధ్యాయురాలు శారద అన్నారు. మంగళవారం నవతెలంగాణతో ఆమె మాట్లాడుతూ.. రోజువారీగా 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల 30 నిమిషాల వరకు అంగన్వాడి కేంద్రాలను క్రమంగా నడిపిస్తున్నట్లు ఆమె తెలిపారు. సుమారు 30 మంది బాలబాలికలు, 11 మంది మహిళ గర్భిణీలు తొమ్మిది మంది బాలింతలు తమ కేంద్రంలో నమోదైనట్లు ఉపాధ్యాయురాలు శారద తెలిపారు. మండలంలోని బ్రాహ్మణపల్లి అంగన్వాడి కేంద్రానికి ఆమెను ఆ శాఖ సంబంధిత ఉన్నతాధికారులు ఇన్చార్జి అంగన్వాడి ఉపాధ్యాయురాలుగా నియమించినట్టు ఆమె వివరించారు.

కలెక్టర్, అదనపు కలెక్టర్‌ను కలిసిన డీఐఈఓ

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నిజామాబాద్ జిల్లా ఇంటర్మీడియట్ విద్య అధికారిగా రవికుమార్ నియమితులైన తర్వాత మంగళవారం నిజామాబాద్ జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, జాయింట్ కలెక్టర్ కిరణ్ కుమార్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన వారిలో జిల్లా ఇంటర్ విద్యాధికారి రవికుమార్‌తో పాటు నిజామాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్‌ల సంఘం అధ్యక్షులు చిరంజీవి, ప్రధాన కార్యదర్శి రజియుద్దీన్ అస్లాం, జిల్లా ప్రభుత్వ జూనియర్ కళాశాలల అధ్యాపకుల సంఘం అధ్యక్షులు నరసయ్య ఉన్నారు.

ఉపాధ్యాయుడికి ఉద్యోగ విరమణ

నవతెలంగాణ-పోతంగల్

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వర్తించిన కొల్లూరి వెంకట సుబ్బారావు అనే ఉపాధ్యాయుడు మంగళవారం ఉద్యోగ విరమణ చేశాడు. 39 సంవత్సరాలు ఉపాధ్యాయుడిగా ఆయన విధులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యోగ విరమణ చేసిన సందర్భంగా ఆయనకు ఘనంగా వీడ్కోలు పలికారు.

వేసవిలో వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్



వేసవిలో సోకే వ్యాధుల పట్ల వైద్యులు, ఆయా ఆరోగ్య ఉపకేంద్రాల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే తెలిపారు. మంగళవారం ఈజ్‌గాం పీహెచ్‌సీలో వాతావరణ మార్పుపై వైద్య సిబ్బందికి అవగాహన కల్పించారు. వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, రక్షణ చర్యలపై చర్చించారు. గ్రామాల్లో పనిచేస్తున్న సిబ్బంది వేసవిలో సోకే వ్యాధులు, నివారణ చర్యలపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఆయా పీహెచ్‌సీల్లో ఆరోగ్య ఉపకేంద్రాల్లో ఓఆర్ఎస్ తదితర మందులు అందుబాటులో ఉంచాలని తెలిపారు. వేసవి తీవ్రత ఎక్కువ ఉన్నందున ఏదైనా అత్యవసర పరిస్థితి ఏర్పడినప్పుడు రోగులకు తక్షణమే వైద్యసేవలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. సిబ్బంది అనునిత్యం అప్రమత్తంగా ఉండి వైద్యసేవలు అందించాలని, ఎవరైనా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. అంతకుముందు పీహెచ్‌సీ పాత, కొత్త భవనాలను పరిశీలించారు. అందుబాటులో ఉన్న మందుల వివరాలను సిబ్బందిని అడిగితెలుసుకున్నారు. డీఎం అండొచ్చ తుకారాంభట్, డిప్యూటీ డీఎంహెచ్ సీతారాం, ఫార్మసిస్టులు కె.రమేష్, సూపర్‌వైజర్ తులసీ, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

హాస్టల్ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

- యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.మధు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

రాష్ట్ర వ్యాప్తంగా హాస్టల్లో పనిచేస్తున్న డెయిలీ వైస్ అవుట్ సోర్సింగ్ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని హాస్టల్ డెయిలీ వైస్ అవుట్‌సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మధు అన్నారు. జిల్లా కేంద్రంలోని పోస్ట్ మెట్రిక్ బాలుర పాఠశాలలో నిర్వహించిన జిల్లా స్థాయి విస్తృత స్థాయి సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ గిరిజన ఆశ్రమ పాఠశాలలో పనిచేస్తున్న వర్కర్లకు చాలీచాలని వేతనాలు చెల్లిస్తూ ప్రభుత్వాలు కార్మికుల పొట్ట కొడుతున్నాయని ఆరోపించారు. కార్మికులకు వేతనాలు పెంచాలని ఈఎస్ఐ, పీఎఫ్, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే పెండింగ్ వేతనాలు ఎరియర్స్‌తో సహా చెల్లించాలని, వర్కర్లందరికి రోజు వేతనాలు ఇవ్వాలన్నారు. గత ప్రభుత్వాలు కార్మికులకు న్యాయం చేయలేక పోయాయనీ తెలంగాణ రాష్ట్రంలో నూతనంగా ఏర్పాడిన కాంగ్రెస్ ప్రభుత్వం గత ప్రభుత్వ పోకడను దృష్టిలో పెట్టుకొని వర్కర్ల సమస్యలపై దృష్టి సారించి పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు టెకం ప్రభాకర్, జిల్లా గౌరవ అధ్యక్షులు వెలిశాల క్రిష్ణమాచారి, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముంజం శ్రీనివాస్, యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు అరిగేల కోటయ్య, దివ్య, నాయకులు మాంకు లక్ష్మణ్, వసంత్, మౌనిక, ఛాయ, పుష్ప పాల్గొన్నారు.

పోడు భూములకు పట్టాలు ఇవ్వాలి

నవతెలంగాణ-జన్నారం



ఆదివాసీ గిరిజనులపోడు భూములకు పట్టాలి ఇచ్చి, ప్రతి పేదవానికి ఇల్లు నేర్పించుకోవడానికి రూ.5 లక్షలు ఇవ్వాలని, ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వెడ్మ పున్నం అన్నారు. మంగళవారం మండలంలోని మహమ్మదాబాద్ గ్రామంలో ఆదివాసీ గిరిజన సంఘం సమావేశం సంఘం మండల అధ్యక్షుడు ఎస్‌కే అబ్దుల్లా అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా ఆదివాసీ గిరిజన సంఘం జెండాను ఆవిష్కరించారు. వెడ్మ పున్నం మాట్లాడుతూ, ఆదివాసుల సమస్యల పరిష్కారానికి ఆదివాసులందరూ తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘంలో చేరి పోరాటాలు చేయాలని కోరారు. పోడు భూములకు పట్టాలిచ్చి ఇల్లు నిర్మించుకొనేందుకు రూ. 5 లక్షలు. పెన్షన్లు ఇచ్చి విద్యుత్ బిల్లులు మాఫీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివాసీ గిరిజన సంఘం మండల అధ్యక్షుడు ఎస్‌కే అబ్దుల్లా మాట్లాడుతూ అడవిలో ఉన్న గిరిజనులకు ఉపాధి పూర్తిగా పడిపోయిందని, అటవీ ఉత్పత్తులు టైగర్ జోన్ వల్ల అందడం లేదని, ముఖ్యంగా మల్యాల గ్రామం 150 సంవత్సరాల క్రితం ఏర్పడ్డ, వారికి కనీస వసతులు రోడ్డు, విద్యుత్, నివాసాలు, నీరు కూడా లేవని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు కనికరపు అశోక్, ఆదివాసీ గిరిజన సంఘ నాయకులు పాల్గొన్నారు.

భారీ వాహనాల రాకపోకలకు అనుమతించాలి



నవతెలంగాణ-జన్నారం

జన్నారం మీదుగా భారీ వాహనాల రాకపోకలను అనుమతించేలా చర్యలు తీసుకోవాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌ను స్థానికులు కోరారు. మంగళవారం మండల కేంద్రంలో ఆయనకు వినతి పత్రం అందించారు. గత కొంత కాలంగా జన్నారం రహదారులపై ఆటవిశాఖ భారీ వాహనాల రాకపోకలపై ఆంక్షలు ఎత్తివేయాలని మండల ప్రజలు ప్రభుత్వానికి, ఆటవిశాఖ అధికారులకు అనేక సార్లు విన్నవించిన సమస్య పరిష్కరించటం లేదని తెలిపారు. ఆటవి శాఖ ఆంక్షలు ఎత్తివేయని యెడల ఉద్యమ బాట పడుతామని స్పష్టం చేశారు. స్పందించిన ఎమ్మెల్యే కవ్వాల్ టైగర్ రిజర్వు ఫీల్డ్ డైరెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడి త్వరలో సమస్య పరిష్కరిస్తమని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సామాజిక పోరాట సమితి శ్రీరాముల భూమాచారి, బోడ ఓంకారేశ్వర్, కొండపల్లి మహేష్, దాసరి తిరుపతి, అక్బర్, మక్సూద్, సుజాత్, ముబీన్ పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరానికి స్పందన



నవతెలంగాణ-కాగజ్‌నగర్

శ్రీ కొత్తపల్లి వెంకటలక్ష్మి చంద్రయ్య మెమోరియల్ సర్వీసు సొసైటీ ఆధ్వర్యంలో స్థానిక కిమ్స్ ఆస్పత్రిలో మంగళవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతమైంది. ఈ శిబిరానికి 19 మంది హాజరు కాగా ఆరుగురికి ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. వీరికి బెల్లంపల్లి లయన్స్ క్లబ్ వారి సహకారంతో ఉచితంగా ఆపరేషన్లు చేయించనున్నట్టు సొసైటీ వ్యవస్థాపకులు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్-అనిత దంపతులు తెలిపారు. ప్రతీ మంగళవారం నిర్వహించే ఈ ఉచిత కంటి శిబిరాన్ని అర్హులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

నవతెలంగాణ-కాగజ్‌నగర్

లోక్‌సభ ఎన్నికలలో విధులు నిర్వర్తించే ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని పీఆర్‌టీయూ తెలంగాణ జిల్లాశాఖ పక్షాన కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తౌటం శ్యాంసుందర్, ముడిమడుగుల తిరుపతి మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతున్న వారికి, 58 ఏండ్లు పైబడి ఉన్నవారికి ఎన్నికల విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలని, డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లలో రిపోర్టు చేసేందుకు వెళ్లే సిబ్బందికి ప్రత్యేక బస్సులు కేటాయించాలని, ఎన్నికల సామాగ్రిని, సిబ్బందిని తరలించేందుకు ఆర్టీసీ బస్సులను వినియోగించాలని, పోలింగ్ కేంద్రాలలో తగినంత ఫర్నీచర్‌ను ఏర్పాటు చేయాలని, 2023, నవంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల విధులు నిర్వర్తించిన కొద్ది మందికి ఇప్పటి వరకు రెమ్యునరేషన్ ఇవ్వలేదని, వెంటనే చెల్లించాలని వారు కోరారు.

పంచలోహ నవగ్రహ విగ్రహాల అందజేత

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రాల్లోని కేస్లాపూర్ ఆంజనేయస్వామి ఆలయానికి మాజీ ఎంపీపీ బాలేష్ గౌడ్ దంపతులు పంచలోహ నవగ్రహ విగ్రహాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయానికి విగ్రహాలు అందజేయడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. అనంతరం ఆలయ అర్చకులు శిరీష్ శర్మ విగ్రహాలకు అభిషేకం, పుష్పార్చన, ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు వివేక్, జీవన్, నారాయణమూర్తి, యాదగిరి, శ్రీనివాస్, మధు, భూమేందర్ భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా వైద్య విద్యార్థుల గ్రాడ్యుయేషన్ డే వేడుకలు

- పాల్గొన్న కలెక్టర్, రిమ్స్ డైరెక్టర్ • విద్యార్థులకు పట్టాలు అందజేత • ఆకట్టుకున్న నృత్యాలు











నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా కేంద్రంలోని రిమ్స్‌లో 2018 విద్యా సంవత్సరానికి సంబంధించిన వైద్య విద్యార్థులు గ్రాడ్యుయేషన్ డేను ఘనంగా నిర్వహించారు. మంగళవారం రాత్రి రిమ్స్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు. విద్యార్థుల కేరింతల, చిందుల నడుమ కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. ముందుగా గుస్సాడీ నృత్యం సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా కలెక్టర్ రాజర్షిషా, రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ హాజరయ్యారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వైద్యులు సూపర్ హీరోలని అన్నారు. కరోనా బాధితుల ప్రాణాలను కాపాడారని కొనియాడారు. ప్రస్తుతం డిగ్రీ పట్టా పొందిన విద్యార్థులు వారి స్నేహితులు, బంధుమిత్రులను సైతం ఇప్పటినుంచి పేషంట్లలా వ్యవహరించాల్సి వస్తుందన్నారు. పట్టా స్వీకరణ సమయంలో చేసిన ప్రతిజ్ఞను జీవితాంతం నిలబెట్టుకోవాలని సూచించారు. కోవిడ్ సమయంలో తాను సంగారెడ్డిలో విధులు నిర్వహించేటప్పుడు వైద్యులు పారామెడికల్ సిబ్బంది తమ ప్రాణాలకు తెగించి విధులను నిర్వర్తించారని గుర్తు చేశారు. వైద్యులు మానవత దృక్పథంతో వ్యవహరించిన తీరును తాను దగ్గరుండి చూశానన్నారు. అనంతరం 101 మంది వైద్య విద్యార్థులకు పట్టాలను అందజేశారు. కార్యక్రమంలో మెడికల్ సూపరింటెండెంట్ ఇద్రీస్ అక్బాని, వైద్య కళాశాల డీన్ డా.వంజరి, వైస్ ప్రిన్సిపాల్ డా.సరోజ, విద్య విల్సన్, ఫోరెన్సిక్ హెచ్‌ఓడి కరుణాకర్, బయో కెమిస్ట్రీ హెచ్‌ఓడీ రత్న కుమారి, అనస్థీషియా హెచ్‌ఓడీ చంద్రశేఖర్, వైద్యులు, వైద్య విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.